సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
గురువారం, 26.03.2026

www.mudranews.in | @mudranews


సంపుటి:13 సంచిక: 154
పేజీలు: 12 వెల: రూ. 5


## నయా హైదరాబాద్

### ఎలివేటెడ్ కారిడార్లు, గ్రేటర్‌లో అండర్ పాసులు

- నగరం చుట్టూ రైలు..
- నగరంలో మెట్రో పరుగులు
- దేశంలోనే తొలి ఎయిర్ పోర్ట్ కింద అండర్ పాసు
- మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం
- నడిమధ్యలో భారీ శివుని విగ్రహం

10




- అరెస్ట్ లు లేకుండానే నేరుగా చార్జిషీట్
- గులాబీ దళంలో మేకపోతు గాంభీర్యం
- నాయకత్వలోపం ఫీలింగ్ లో బీఆర్ఎస్ శ్రేణులు
- పట్టు సాధించలేకపోతున్న కేటీఆర్
- సొంతగూటి ఒత్తిళ్లలో హరీశ్
- ఫాంహౌస్ లో కేసీఆర్..
- ఇంకో ఏడాదిన్నర వరకు ఆయనది సైలెంట్ మోడ్..?
- కేసులు, విచారణలతో కాంగ్రెస్ పంజా

# కోటగోడలు కూలేనా?

గులాబీ బలంపై రేవంత్ వ్యూహం


ఏడాదిన్నరలోగా బలహీన రాజకీయం

## ఒకే టార్గెట్‌లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్!

ఫార్ములా కేసులో కేటీఆర్ ఇరికినట్టేనా..?

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
వరుసగా ఏదో ఒక ఇష్యూను బీఆర్ఎస్ బిగ్ బాస్ ల మీద మోపుతున్నారు. ఒకటి వివరణ ఇచ్చుకునేలోగా.. మరొకటి.. దాన్ని కవర్ చేసేలోగా ఇంకోటి... వరుసగా ఏదో ఒక అంశాన్ని కాంగ్రెస్ తెరపైకి తెస్తుంది. మధ్య మధ్యలో కవిత బాణాలు.. ఇదే సమయంలో విచారణ బృందాల నోటీసులు.. ఇది తప్పించుకునేలోగా రాజకీయపరమైన ఇబ్బందులు గులాబీ దళాన్ని షేక్ చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులను సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా కదిలిస్తున్నట్లు స్పష్టమవుతున్నది. ఎందుకంటే బీఆర్ఎస్ పార్టీని బలహీనం చేయాలంటే ముందుగా ఆ పార్టీ పిల్లర్ల వంటి నేతల్ని సొంత నియోజకవర్గాల్లో బలహీనం చేయాలి. విషయం ఏదైనా.. కేసులైనా.. ఏదేమైనా బలహీన మంత్రం ప్లాన్ ను రేవంత్ అమలు చేయడం ప్రారంభించారు. ఇది రేవంత్ టీం భావిస్తున్నట్లు అంత తేలిక కాకపోయినా.. ఎక్కడైనా తమకు అవకాశంగా మారవచ్చు అనే ఆశల్లో కాంగ్రెస్ టీం ఉంది.

**ఇటు ఫార్ములా కేసు..**
**అటు కేసీఆర్ కు అసెంబ్లీ ప్లాన్**
ప్రభుత్వం చేసే బలహీన పాలిట్రిక్స్ ప్లాన్ ను బీఆర్ఎస్ ఏదో తేలిగ్గా కొట్టిపారేస్తున్నట్లు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నది. కానీ అంతర్గతంగా భయం పట్టుకునే ఉంది. తాజాగా ఫార్ములా–ఈ రేస్ వ్యవహారం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1 గా చేరుస్తూ ఏసీబీ దాఖలు చేసిన ఛార్జిషీట్ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త మలుపులకు కారణం అవుతోంది. ఇదో లొట్టపీసు కేసు అంటూ గులాబీ దళం లైట్ తీసుకున్నట్లు చెప్తున్నా.. అంతర్గతంగా మాత్రం భయంలోనే ఉంది. ఎందుకంటే ఇందులో ఐఏఎస్‌ల పాత్ర కూడా ఉంది. అధికారులు తప్పించుకునే ప్రయత్నంలో అది కేటీఆర్ వైపు తిరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. దీనిపై కేటీఆర్‌లో కూడా అంతర్గత భయం ఉందనే చెబుతున్నారు. దీంతో ప్రజా సమస్యలు, అసెంబ్లీలో నిలదీసే కార్యక్రమాలకు కేటీఆర్ వర్గం దూరం దూరంగానే **మిగతా 02లో**




## అనర్హత వేటుపై హైకోర్టు సీరియస్ 03

- స్పీకర్‌తో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలకు షాక్
- ఏప్రిల్ 16కు వాయిదా





## పెట్రోల్, డిజీల్‌పై ఆందోళన వద్దు

రాష్ట్రంలో 2 నెలలకు సరిపడా నిల్వలున్నాయి

- కమర్షియల్ గ్యాస్ కొరతపై కేంద్రంతో చర్చలు జరుపుతున్నాం 03
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## దమ్ముంటే నువ్వే పోటీ చెయ్

సీఎంకు హరీశ్ రావు సవాల్ 03

- నావైపే సిద్ధిపేట ప్రజలు
- రెండో సారి సీఎం.. రేవంత్ కల



# ఇంధన మంట

## తెలంగాణ అతలాకుతలం

- అసలు పెట్రోల్ కొరత ఉందా?
- బంకులు ఎందుకు మూతపడుతున్నాయి?
- కొరత లేదంటూ పౌరసరఫరాల శాఖ క్లారిటీ
- అత్యవసరంగా సీఎం సమీక్ష
- బంకుల ముందు వాహనాల బారులు
- ఇంకా తెగని లొల్లి




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
ఎంకి పెళ్లి సుబ్బి సావుకు వచ్చినట్లు ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ దేశాలు అల్లాడిపోతున్నాయి. డిమాండ్‌కు సరఫరా చమురు లభ్యత లేకపోటవంతో చాలా దేశాల్లో వంట గ్యాస్‌తో పాటు ఇంధన కొరత ఏర్పడింది. ఇప్పుడి సెగ హైదరాబాద్ నగరాన్ని కూడా తాకింది. నగరంలో పెట్రోల్, డీజిల్ లభ్యతపై ఆందోళన నెలకొంది. జనం బంకుల ముందు బారులు తీరుతున్నారు. దానికి కారణం స్టాకు అయిపోయి కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు మూతపడటం. రెండు రోజులుగా నగరంలోని పలు చోట్ల పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. ఆయిల్ కంపెనీలు ముందుగా నగదు చెల్లిస్తేనే స్టాక్ అనే కొత్త నిబంధన తేవడంతో హైదరాబాద్ నగరంలో పెట్రోల్, డీజిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాత అప్పులు తీర్చి, కొత్త స్టాక్‌కు ముందే డబ్బు కట్టలేక పలు బంకులు **మిగతా 02లో**

## శీనూ వైట్ల.. సినిమా అంటే ఇది

### మోసపోయిన దర్శకుడు

- ఏడు కోట్ల భూ కుంభకోణం
- పోలీస్ స్టేషన్‌కు చేరిన కేసు
- అసలు ఏమైందంటే? 09




*వెండితెరపై ట్విస్టులతో కథలు నడిపించే స్టార్ డైరెక్టర్ శ్రీను వైట్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలో భూమి ఇప్పిస్తామని నమ్మించి నకిలీ పత్రాలతో ఆయనకు ఏకంగా రూ. 7.2 కోట్ల టోపీ పెట్టారు. తీరా మోసపోయానని గ్రహించిన దర్శకుడు ఇప్పుడు న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు.*

# పునర్విభజన దెబ్బ

## ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

- పొలిటికల్ గేమ్ ఛేంజర్‌గా డీలిమిటేషన్
- అధికార పార్టీలకు అడ్వాంటేజ్?
- హైదరాబాద్ చుట్టూ మారనున్న స్వరూపం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
కేంద్రం తీసుకుంటున్న నియోజకవర్గాల పునర్విభజన ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది. దీంతో రాష్ట్ర రాజకీయ స్వరూపమే పూర్తిగా మారనున్నది. అయితే, ఈ పునర్విభజన వల్ల అధికార పార్టీలకు అడ్వాంటేజ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.దేశంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ నియోజకవర్గాల పునర్విభజన చేసిన తర్వాతే వచ్చే ఎన్నికలు జరుగుతాయని కేంద్రం క్లారిటీ ఇస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు మాత్రమే కాదు, అది రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసే గేమ్ ఛేంజర్. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన, 2029 ఎన్నికల నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ యోచన ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లోని సెక్షన్ 26 ప్రకారం సీట్ల పెంపు అంశం మళ్లీ తెరపైకి రావడంతో, ఏ ప్రాంతానికి ఎన్ని సీట్లు వస్తాయి? ఏ పార్టీకి లబ్ధి చేకూరుతుంది? అనే విశ్లేషణలు మొదలయ్యాయి. **మిగతా 02లో**




## ఇప్ప సారాపై హీటెక్కిన అసెంబ్లీ

అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై రాకేశ్ రెడ్డి సెటైర్లు



- ఆ సారాకు ఇందిరమ్మ పేరు పెట్టొద్దని వ్యాఖ్య 09
- రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు




## డాక్టర్ వర్సెస్ ఫార్మా కంపెనీలు 09

ఓఆర్ఎస్ లేబుల్ వివాదం

- ఒంటరి పోరాటం చేసి గెలిచిన పిల్లల డాక్టర్
- జీర్ణించుకోలేని ఫార్మా కంపెనీలు
- పోరాటంచేసిన డాక్టర్ కు లీగల్ నోటీసులు
- దేశ వ్యాప్తంగా వైద్య సంఘాల తిరుగుబాటు
- ఫార్మా కంపెనీలపై మండిపడ్డ వైద్యులు

- ప్రాంతీయ అసమానతల పేరిట విడదీసే కుట్ర చేస్తున్న రేవంత్
- మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు ద్వేషం
- సీట్ల పెంపుతో దేశానికి లాభమే కానీ నష్టం లేదు
- దక్షిణ రాష్ట్రాల పేరుతో రేవంత్ రాజకీయ డ్రామా 03




## దక్షిణాదికి నష్టం ఎక్కడుంది?

లోక్ సభ సీట్లు పెంపుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నలు

## విధి లేని పరిస్థితిలో వీడుతున్నా.. 06

కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా..




- ఇంకా ఎంతకాలం ఈ అవమానాలు
- జీవన్ రెడ్డి వెంటే ఉంటామని నినదించిన అభిమానులు
- రేవంత్ రెడ్డి తీరుతోనే పార్టీకి దూరం
- వేం నరేందర్, పోచారం కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలేంటి?
- ఫిరాయింపుదారుడికి సీటు ఇవ్వడంతోనే కాంగ్రెస్ పతనం
- అభిమానుల సదస్సులో జీవన్ రెడ్డి ఆగ్రహం

*యుద్ధ మేఘాల మధ్య అంతర్జాతీయ ఇంధన రంగం కుప్పకూలింది. రష్యా–ఉక్రెయిన్ ఘర్షణలు, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంతో హర్మూజ్ జలసంధి మూతపడటం ప్రపంచాన్ని సంక్షోభంలోకి నెట్టింది. ఖతార్ ఎల్ఎన్‌జీ ప్లాంట్లు, సౌదీ ఆయిల్ కేంద్రాలపై దాడులతో సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో పెట్రోల్, డీజిల్ కోసం బంకుల ముందు కిలోమీటర్ల మేర క్యూలు కనిపిస్తున్నాయి.*


## ముక్కలవుతున్న ఇంధన సామ్రాజ్యం


ప్రపంచాన్ని మట్టుముట్టిన చమురు సంక్షోభం!

ఖతార్ నుంచి రష్యా వరకూ ఇదే పరిస్థితి

- ప్రపంచం ఎన్నడూ చూడని విపరీతాలు
- రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలు
- అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం..
- మూతపడ్డ హర్మూజ్ జలసంధి
- ప్రపంచంలోనే పెద్ద ఎల్ఎన్జీ కాంప్లెక్స్ పై ఇరాన్ దాడి
- సౌదీ అరేబియాలోని క్రూడ్ ఆయిల్ కేంద్రాలపై దాడులు



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 26.03.2026
www.mudranews.in | @mudranews



## ఐపీఎల్ మెమోరీస్



ఎంఎస్ ధోని మ్యాజిక్చివరి ఓవర్లలో ఫినిషింగ్ అంటే ధోనీనే గుర్తొచ్చేలా చేసిన మ్యాచ్‌లు.

# కోటగూడలు కూలేనా?

(మొదటి పేజీ తరువాయి)

ఉంటోంది. మరోవైపు, గులాబీ దళపతి కేసీఆర్.. కేవలం ఫాంహౌస్ కు పరిమితం అయ్యారు. ఏడాదిలో ఓ సారి బయటకు వచ్చి.. రేపట్నుంచి పోరాటం అంటూ ఓ ప్రెస్ మీట్ పెట్టి తిరుగు ప్రయాణం అవుతున్నారు. దీంతో కేసీఆర్ వస్తారని.. ఏదో చేస్తారనే నమ్మకం పోతోంది. ఇప్పుడు అసెంబ్లీకి రాకపోవడం కూడా అధికార పార్టీకి అవకాశంగానే మారింది.

**కంచుకోటలపైకి గురి**

సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వ్యూహాత్మకంగా బలహీనం చేయాలనుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆయన మొదటగా ఆ పార్టీ ముఖ్యనేతలను బలహీనం చేయాలనుకుంటున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల కంచుకోటలను బద్దలు కొట్టాలనుకుంటున్నారు. సిద్ధిపేట, గజ్వేల్, సిరిసిల్ల ఈ మూడు కేవలం నియోజకవర్గాలు మాత్రమే కాదు.. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలుగా ఉన్న నియోజకవర్గాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు లక్ష్యంగా చేసుకుని, గులాబీ దళపతులైన హరీష్ రావు, కేసీఆర్, కేటీఆర్‌లను రాజకీయంగా బలహీనపరిచేందుకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు బీఆర్ఎస్ అగ్రనేతల సొంత నియోజకవర్గాల్లో ఆ పార్టీని నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. సిద్ధిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం దీనికి స్పష్టమైన సంకేతం. హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేటలో అడుగుపెట్టిన రేవంత్, అక్కడ అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపుతూనే, రాజకీయంగా ఆధిపత్యం సాధించేందుకు పావులు కదుపుతున్నారు. కేవలం గెలవడమే కాదు, ప్రత్యర్థి నాయకత్వాన్ని స్థానికంగా దెబ్బతీయాలన్నది రేవంత్ మాస్టర్ ప్లాన్. రేవంత్ రెడ్డి అనుకుంటున్నంత సులభంగా ఈ మూడు నియోజకవర్గాల్లో మార్పు రావడం అసాధ్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఆ నియోజకవర్గాల్లో పార్టీ కాదు.. నాయకత్వమే బలం!**

సిద్ధిపేటలో హరీష్ రావుకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్, గజ్వేల్‌లో కేసీఆర్ పట్ల ఉన్న సెంటిమెంట్, సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధి పనులు ఆ నాయకులను ప్రజలకు దగ్గర చేశాయి. ఈ ముగ్గురూ తమ నియోజకవర్గాల్లో కేవలం రాజకీయ నాయకులుగానే కాకుండా, కుటుంబ సభ్యులుగా స్థిరపడిపోయారు. వారిని ఢీకొనాలంటే కేవలం అధికార బలం సరిపోదు, అంతకు మించిన ప్రజాదరణ ఉన్న నేతలు కాంగ్రెస్ వైపు ఉండాలి. ప్రస్తుతం ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడం. సిద్ధిపేటలో హరీష్ రావుకు దీటైన నాయకుడు కానీ సిరిసిల్లలో కేటీఆర్‌ను అడ్డుకోగల చరిష్మా ఉన్న నేత కానీ ప్రస్తుతం కాంగ్రెస్‌లో కనిపించడం లేదు.

**కాంగ్రెస్‌కు మాస్ లీడర్ల కొరత**

ద్వితీయ శ్రేణి నాయకత్వం బలపడకుండా, కేవలం పైస్థాయి నుంచి చేసే విమర్శలు ఓట్లుగా మారవు. స్థానిక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, బీఆర్ఎస్ అగ్రనేతల ప్రభావాన్ని తగ్గించగలిగే మాస్ లీడర్ల అవసరం కాంగ్రెస్‌కు ఉంది. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు. గతంలో ఇంద్రుడిలా వెలిగిన ఎందరో అగ్రనేతలు తమ సొంత గడ్డపైనే ఓటమి పాలైన చరిత్ర ఉంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. ప్రభుత్వ పథకాలను ఈ నియోజకవర్గాల్లో సమర్థవంతంగా అమలు చేస్తూ, బీఆర్ఎస్ కేడర్‌ను ఆకర్షించడం ద్వారా ఆ కోటలను బీటలు వారేలా చేయవచ్చు. ముఖ్యంగా అభివృద్ధి పనుల్లో వివక్ష చూపుతున్నారనే ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని కలిగించడం రేవంత్ ముందున్న సవాలు.రేవంత్ రెడ్డి సంకల్పం గట్టిగానే ఉన్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల నాయకత్వాన్ని మర్చిపోయేలా చేసే స్థాయి ఉన్న నేతలు స్థానికంగా ఎదిగితేనే కాంగ్రెస్‌కు అక్కడ భవిష్యత్తు ఉంటుంది. ఒకవేళ రేవంత్ రెడ్డి ఈ మూడు స్థానాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయగలిగితే, అది తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అతిపెద్ద మలుపు అవుతుంది. ఇప్పటికే అక్కడ బలమైన నేతల్ని గుర్తించి ప్రోత్సహించే వ్యూహాన్ని రేవంత్ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో బలమైన పోటీ ఇచ్చే అభ్యర్థుల్ని రెడీ చేసుకున్నా అది బీఆర్ఎస్ పార్టీ వ్యూహాల్లో కీలకమైన మార్పులు తెస్తుంది. మరి రేవంత్ రాజకీయం ఈ సారి ఆయన వ్యూహాలకు తగ్గట్లుగా సాగుతుందా?

**ఫార్ములా కేసు**

రాజకీయాల్లో కొంతకాలంగా వినిపిస్తున్న ఫార్ములా–ఈ రేస్ వ్యవహారం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1 గా చేరుస్తూ ఏసీబీ దాఖలు చేసిన ఛార్జిషీట్ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త మలుపులకు కారణం అవుతోంది. అరెస్టుల వంటి హడావుడి లేకుండానే, పక్కాగా సాక్ష్యాధారాలతో కేటీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం చట్టపరమైన చిక్కుల్లో పడేసిందనే విశ్లేషణలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. సాధారణంగా అవినీతి కేసుల్లో రాజకీయ నేతలపై ఆరోపణలు వస్తే వెంటనే అరెస్టులు చేసి హడావుడి చేయడం చూస్తుంటాం. కానీ, ఫార్ములా–ఈ కేసులో రేవంత్ ప్రభుత్వం భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. సుమారు 55 కోట్ల రూపాయల నిధులు హెచ్ఎండీఏ ఖాతా నుండి విదేశీ సంస్థ అయిన ఎఫ్ఈఓ కు ఎలా మళ్లాయనే అంశంపై బ్యాంకింగ్ లావాదేవీల రికార్డులను పక్కాగా సేకరించింది. ఏ ఒత్తిడి వల్ల, ఏ నిబంధనలను ఉల్లంఘించి ఈ నిధులు విడుదలయ్యాయో అధికారుల స్టేట్‌మెంట్ల ద్వారా నిర్ధారించింది.

**విధానపరమైన లోపమే అసలు సమస్య**

కేటీఆర్ ఈ కేసును లొట్టపీసు కేసు అని కొట్టిపారేస్తున్నప్పటికీ, సాంకేతికంగా ఆయన ఇక్కడ ఇరుక్కుపోయినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ నిధులను విదేశాలకు పంపాలంటే క్యాబినెట్ ఆమోదం, ఆర్థిక శాఖ అనుమతి, సెంట్రల్ బ్యాంక్ నిబంధనలు పాటించాలి. అయితే, రేసు నిర్వహణ కోసం తొందరపాటుతో ఈ ప్రక్రియను పక్కన పెట్టి నిధులు మళ్లించడమే ఇప్పుడు ఆయనకు శాపంగా మారింది. పని చేశాము కానీ ప్రాసెస్ పాటించలేదు అనే వాదన న్యాయస్థానంలో చెల్లదు. అవినీతి నిరోధక చట్టం ప్రకారం నిబంధనల ఉల్లంఘన కూడా నేరమే అవుతుంది.

**అరెస్టులు లేవు.. నేరుగా ట్రయల్స్**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇక్కడ ఒక తెలివైన వ్యూహాన్ని అమలు చేసింది. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే అది రాజకీయ కక్షసాధింపుగా మారి ఆయనకు సానుభూతి వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే, అరెస్టుల జోలికి వెళ్లకుండానే విచారణ పూర్తి చేసి, ఏసీబీ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయించింది. ఇప్పుడు కేసు నేరుగా ట్రయల్ దశకు చేరుకుంది. కోర్టులో సాక్ష్యాధారాలు నిరూపితమైతే, అది కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుకు పెద్ద గండంగా మారుతుంది. ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఇచ్చిన వివరణలు కేటీఆర్‌కు ఇబ్బందికరంగా మారాయి. పైస్థాయి ఒత్తిళ్ల వల్లే నిధులు విడుదల చేయాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా జరిగిన ఈ పొరపాటుకు రాజకీయ నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఏసీబీ తన ఛార్జిషీట్‌లో బలంగా పేర్కొంది. రికార్డుల్లో ఉన్న సంతకాలు, అధికారిక ఆదేశాలు కేటీఆర్‌ను డిఫెన్స్‌లో పడేశాయి.

**రాజకీయ ఎఫెక్ట్ - ఇమేజ్ డ్యామేజ్**

తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో పెట్టడానికే రేసు నిర్వహించామని కేటీఆర్ చెబుతున్నప్పటికీ, నిధుల మళ్లింపు ఆరోపణలు ఆయన క్లీన్ ఇమేజ్ ను దెబ్బతీస్తున్నాయి. చట్టపరంగా శిక్ష పడితే ఆయన ఎన్నికల్లో పోటీ చేసే అర్హతపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అదే జరిగితే, బీఆర్ఎస్ పార్టీకి ఇది కోలుకోలేని దెబ్బ అవుతుంది. రేవంత్ రెడ్డి ఎక్కడా తొందరపడకుండా, నిశ్శబ్దంగా కేటీఆర్‌ను న్యాయపరమైన ఉచ్చులో బిగించడంలో సఫలమయ్యారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు బంతి న్యాయస్థానం పరిధిలో ఉంది. నిందితులకు సమన్లు జారీ చేయడం, సాక్షుల విచారణ వంటి ప్రక్రియలు వేగవంతం కానున్నాయి. ఒకవేళ కోర్టు ఈ కేసులో సీరియస్ నిర్ణయం తీసుకుంటే, కేటీఆర్ కుదుటపడటం అంత సులభం కాదు. ఇది కేవలం రాజకీయ ఆరోపణ మాత్రమే కాదు, పక్కాగా రికార్డులతో కూడిన ఆర్థిక నేరం కాబట్టి, న్యాయ పోరాటం ఆయనకు అగ్నిపరీక్షగా మారనుంది.

**చార్జ్ షీట్ లో ఏముంది..?**

బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో 2023 ఫిబ్రవరిలో హైదరాబాద్ వేదికగా ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించారు. హుస్సేన్ సాగర్ వద్ద రేసు నిర్వహణ కోసం జరిగిన ఒప్పందాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో కంపెనీ ఏస్ నెక్ట్స్ జెన్, మున్సిపల్ శాఖ, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (FEO) మధ్య 2022 అక్టోబర్ 25న రేసు నిర్వహణపై ఒప్పందం జరిగింది. రేసుల నిర్వహణతో పాటు ట్రాక్ నిర్మాణం కోసం సదుపాయాలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కల్పించాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 11న సీజన్ 9 నిర్వహించగా.. ఎఫ్ఈవో, ఏస్ నెక్స్ జెన్ సంస్థల మధ్య విభేదాలు తలెత్తాయి. తమకు డబ్బులు చెల్లించని కారణంగా రేస్ నిర్వహించడం లేదని యూకే సంస్థ ఎఫ్ఈవో రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పింది. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ఏఎండీ, ఎఫ్ఈవోల మధ్య 2023 అక్టోబర్ లో కొత్తగా ఒప్పందం చేసుకున్నారు. మొత్తం రూ.110 కోట్లు చెల్లించాలని ఎఫ్ఈవో ఒప్పందం చేసుకుంది. మరో 50 కోట్లు సైతం నిధులు విడుదల చేశారు. అయితే ఆర్బీఐ నిబంధనలను కాదని, హెచ్ఎండీఏ నిధుల నుంచి సుమారు రూ.160 కోట్లు కేటాయించడం, అందులో రూ.45 కోట్లకు పైగా విదేశీ కరెన్సీ రూపంలో బదిలీ చేయడంపై ఐటీ శాఖ కూడా గతంలో హెచ్ఎండీఏకు రూ.8 కోట్ల జరిమానా విధించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరిపి, మొత్తం పది మందిపై కేసులు నమోదు చేసింది. కేటీఆర్‌తో పాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను విచారణలో భాగంగా ఏసీబీ అధికారులు రెండుసార్లు ప్రశ్నించారు.రేసు నిర్వహించింది విదేశీ సంస్థ కావడంతో ఆ కంపెనీ ప్రతినిధులను ఏసీబీ అధికారులు ఆన్ లైన్ ద్వారా ప్రశ్నించి వివరాలను ఛార్జిషీటులో పొందుపరిచారు. నిందితులు నేరపూరిత కుట్రకు పాల్పడి ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారని ఏసీబీ పేర్కొంది. మాజీ మంత్రి కావడంతో కేటీఆర్ విచారణ కోసం గవర్నర్ అనుమతి, ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ప్రాసిక్యూషన్ కోసం కేంద్రం నుంచి అనుమతి వేచిచూడాల్సి వచ్చింది. సంబంధిత వ్యక్తులు, సంస్థల ప్రతినిధుల్ని ప్రశ్నించిన తర్వాత ఏసీబీ అధికారులు తుది నివేదికను సిద్ధం చేశారు. సోమవారం నాడు నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది.

**కాళేశ్వరం కేసు.. ఫోన్ ట్యాపింగ్ ప్రమాదంలో కేసీఆర్**

మరోవైపు ఫాంహౌస్ నుంచి అంతా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పే కేసీఆర్ చుట్టూ కాళేశ్వరం కేసు ఉండనే ఉంది. ఏదైనా అంశాన్ని కేసీఆర్ లేవనెత్తితే.. వెంటనే కాళేశ్వరం కేసు తెరపైకి వస్తోంది. మళ్లీ నోటుసులు.. విచారణ.. కోర్టుకెక్కడం సాధారణమే అయింది. దీనికితోడు ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు కూడా ఇంకా చిక్కుకునే ఉంది. వీటిని తెంపుకునేందుకు కేసీఆర్ న్యాయపోరాటానికి కూడా దిగారు. కానీ, ఎటు నుంచి ఇంకా ఊరట రాని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఆయన అసెంబ్లీకి దూరంగా ఉండటం కాంగ్రెస్ కు ఇంకో ప్లస్.

**రాజకీయ ప్రమాదంలో హరీశ్**

ఇవన్నీ ఒకవైపు జరుగుతుంటే గతంలో హరీశ్ రావు పార్టీ బాధ్యతలను మీదేసుకుని తిరిగే ప్రయత్నం చేశారు. కానీ, కవిత రూపం.. అటు బీఆర్ఎస్ దిగ్గజాల నుంచి హరీశ్ కు అందని ప్రోత్సాహంగా మారిపోయింది. కేవలం సిద్ధిపేటకు పరిమితమవుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా స్వతహాగా తిరిగి.. ఓ కేడర్ ను పోగేసుకోలేని పరిస్థితుల్లో హరీశ్ రావు ఉన్నారు. దీంతో సొంత గూటిలోనే అల్లుడికి పొగ పెట్టుతూనే ఉన్నారు.

# పునర్విభజన దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

**సీట్ల సంఖ్యలో భారీ మార్పులు**

పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 175 నుండి 225కు, తెలంగాణలో 119 నుండి 153కు పెరగాల్సి ఉంది. అంటే ఏపీలో అదనంగా 50 స్థానాలు, తెలంగాణలో 34 స్థానాలు కొత్తగా రానున్నాయి. అయితే, రిపోర్టుల ప్రకారం ప్రతి రాష్ట్రంలో 50 శాతం మేర సీట్లు పెరిగే అవకాశం ఉందన్న సంకేతాలు వస్తున్నాయి. అదే జరిగితే ఏపీలో సీట్ల సంఖ్య 260 దాటవచ్చు, తెలంగాణలో 180కి చేరుకోవచ్చు. ఈ పెరుగుదల రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది కానుంది.

**హైదరాబాద్ చుట్టూరా రాజకీయ కేంద్రీకరణ**

తెలంగాణ విషయానికి వస్తే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల్లో అత్యధిక సీట్లు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్ వంటి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య భారీగా ఉంది. పునర్విభజన జరిగితే ఈ ఒక్కో నియోజకవర్గం రెండు లేదా మూడు కొత్త సీట్లుగా విడిపోయే ఛాన్స్ ఉంది. దీనివల్ల రాష్ట్ర రాజకీయం మరింతగా పట్టణ ప్రాంతాల ఓటర్లపై ఆధారపడే పరిస్థితి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో సీట్ల పెరుగుదల తక్కువగా ఉంటే, అధికార పీఠం దక్కించుకోవడంలో అర్బన్ ఓటింగ్ అత్యంత కీలకం కానుంది.

**ఆంధ్రప్రదేశ్ లో కోస్తా వర్సెస్ రాయలసీమ**


ఏపీలో సీట్ల పెంపు ప్రాంతాల వారీగా తీవ్ర ప్రభావం చూపనుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో జనాభా సాంద్రత ఎక్కువగా ఉండటంతో, అక్కడ సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి నగరాల పరిధిలో కొత్త నియోజకవర్గాలు పుట్టుకొస్తాయి. దీనికి భిన్నంగా రాయలసీమలో జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉండటంతో, అక్కడ సీట్ల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగకపోవచ్చు. ఇది అసెంబ్లీలో రాయలసీమ ప్రాంతం యొక్క రాజకీయ బలాన్ని కొంత తగ్గించే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**పొలిటికల్ డైనమిక్స్ మార్చే గేమ్ ఛేంజర్**

సీట్ల సంఖ్య పెరగడం వల్ల రాజకీయ పార్టీల్లో కొత్త తలనొప్పులు మొదలవుతాయి. నియోజకవర్గాల పరిధి తగ్గడం వల్ల స్థానిక నాయకత్వం బలం పెరుగుతుంది. పెద్ద నియోజకవర్గాల్లో ఇద్దరు ముగ్గురు బలమైన నేతలు ఉన్న చోట, సీట్ల పెంపు వల్ల గ్రూపు తగాదాలు తగ్గే అవకాశం ఉన్నా, కొత్తగా ఏర్పడే స్థానాల్లో తమ వర్గాన్ని నిలబెట్టుకునేందుకు అగ్రనేతలు పోటీ పడతారు. అలాగే, మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తే, పెరిగిన సీట్లలో అధిక భాగం మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. ఇది పురుష రాజకీయ నేతల ఆధిపత్యానికి గండి కొట్టే అంశం.

**అధికార పార్టీలకు అడ్వాంటేజ్ అవుతాయా?**

2011 జనాభాను ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల జనాభా నియంత్రణ పాటించిన ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళన కూడా ఉంది. ఉదాహరణకు, అమరావతి లేదా విశాఖ వంటి ప్రాంతాల్లో గత దశాబ్ద కాలంలో జనాభా భారీగా



పెరిగింది, కానీ 2011 లెక్కలనే వాడితే ఆ మార్పులు ప్రతిబింబించవు. అయినప్పటికీ, సీట్ల పెంపుదల వల్ల అసెంబ్లీలో ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగి, పాలన ప్రజలకు మరింత చేరువవుతుందన్నది సానుకూల అంశం. 2029 నాటికి జరగబోయే ఈ నియోజకవర్గాల పునర్విభజన తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త రాజకీయ శకానికి తెరతీయనుంది. ప్రాంతీయ బలాబలాలు, సామాజిక సమీకరణాలు , పార్టీల వ్యూహాలు అన్నీ కలిపి అధికార పార్టీలకు అడ్వాంటేజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.



# ఇంధన మంట

(మొదటి పేజీ తరువాయి)

మూతపడ్డాయి. దీంతో తెరిచి ఉన్న బంకుల వద్ద జనం బారులు తీరడంతో కృత్రిమ కొరత ఏర్పడింది. ఇంధనం నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, చెల్లింపు విధానాల మార్పు వల్ల తలెత్తిన తాత్కాలిక సమస్యేనని ప్రజలు ఆందోళన చెందవద్దని తెలంగాణ పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. గతంలో ఆయిల్ సంస్థలు డబ్బులు తీసుకోకుండానే తొలుత డీజిల్, పెట్రోల్ బంకులకు సరఫరా చేసేవి. స్టాక్ సేల్ అయ్యాక ఒకటి రెండు రోజుల తర్వాత బంకుల యజమానులు ఆయిల్ సంస్థలకు తిరిగి డబ్బులు చెల్లించేవారు. కానీ 3,4 రోజులుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎంత ఇంధనం కావాలంటే ఆ మేరకు డబ్బులు చెల్లిస్తేనే పెట్రోల్, డీజిల్ సరఫరా చేస్తామని ఆయిల్ సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో నగరంలో పలు బంకులకు సరఫరా నిలిచిపోయింది. పాతబకాయిలు వెంటనే చెల్లించాలని కొత్తగా స్టాక్‌కు డబ్బులు ముందే చెల్లించాలని ఆయిల్ సంస్థలు చెబుతుండడంతో నగరంలో పలు చోట్ల బంకులు మూతపడ్డాయి. దీంతో పెట్రోల్ ఉన్న బంకులపై ఒత్తిడి పెరిగి ఒక్క రోజులోనే స్టాకు అయిపోతోంది. మళ్లీ స్టాకు వచ్చే వరకు ఆయా బంకులు మూతపడుతున్నాయి.

**ఇది ఉద్దేశ్యపూర్వకమే**

కాగా, ఆయిల్ కంపెనీలు ఉద్దేశ పూర్వకంగానే ఇబ్బందులకు గురిచేస్తున్నాయని బంకుల యజమానులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కొత్తగా మార్పులు తీసుకురావటం సరైందికాదని అంటున్నారు. ఆయిల్ కంపెనీలు, పెట్రోల్ బంకులు మధ్య ఏర్పడిన వివాదంతో హైదరాబాద్ నగరంలో పెట్రోలు బంకులు మూతపడుతున్నా పౌరసరఫరాలశాఖ చోద్యం చూస్తోందని బంకుల యజమానులు వాపోతున్నారు. పెట్రోల్, డీజిల్ కు కొరత లేదని చేతులు దులిపేసుకుంటున్నారే తప్ప కావాల్సిన చర్యలు తీసుకోవటం లేదని విమర్శిస్తున్నారు. హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలో ఎక్కడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత లేదని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. డిపోలలో తగినంత ఇంధనం ఉందని అంటున్నారు. ప్రజలు అనవసరంగా ఆందోళనకు గురై తమ వాహనాలను ఫుల్ ట్యాంకులు చేసుకునేందుకు ఎగబడటం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే ఛాన్స్ ఉందని హెచ్చరిస్తున్నారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ముందస్తు చెల్లింపు విధానాల్లో చేసిన కొన్ని మార్పుల వల్ల బంకు యజమానులకు తాత్కాలిక సమస్య ఏర్పడిందని చెబుతున్నారు.

**హైదరాబాద్ ఆగమాగం**

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం పెట్రోలు బంకుల వద్ద వాహనదారుల రద్దీ విపరీతంగా పెరిగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. మంగళవారం పలు బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపించడంతో ఆందోళనకు గురైన వాహనదారులు తమ ట్యాంక్ ఫుల్ చేయించుకునేందుకు బంకుల వద్దకు పోటెత్తారు. కూకట్‌పల్లి, ప్రగతినగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్, అమీర్‌పేట, సికింద్రాబాద్, బేగంపేట, ఖైరతాబాద్ వంటి ప్రధాన జంక్షన్లలో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. అకస్మాత్తుగా పెరిగిన డిమాండ్ కారణంగా కొన్ని పెట్రోల్ బంకుల్లో స్టాక్ అయిపోయింది. దీంతో యాజమాన్యాలు 'నో స్టాక్' బోర్డులు ప్రదర్శించడంతో వాహనదారుల్లో మరింత ఆందోళన నెలకొంది. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి చూడటం వల్ల ప్రధాన రహదారులపై ట్రాఫిక్ స్తంభించి పోయింది. చాలా మంది వినియోగదారులు ముందస్తు జాగ్రత్తగా క్యాన్లలో కూడా ఇంధనాన్ని తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.ఈ పరిస్థితిపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందిస్తూ కీలక విజ్ఞప్తి చేశారు. పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న వార్తలన్నీ కేవలం వదంతులు మాత్రమేనని, నగరంలో ఇంధన సరఫరాకు ఎలాంటి ఆటంకం లేదని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని, బంకుల వద్ద అనవసరంగా గుమిగూడటం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఇతర అధికారులు కూడా తెలిపారు. ప్రజలు సంయమనం పాటించాలని పోలీసులు కోరుతున్నారు.

**పలుచోట్ల పెట్రోల్, ఎల్పీజీ కొరత**

నగరవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ కొరత సామాన్యుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ముఖ్యంగా ఉప్పల్, మల్లాపూర్ వంటి ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు అకస్మాత్తుగా మూతపడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండటంతో, ఇది నిజమైన కొరతనా లేక ధరలు పెరుగుతాయన్న ఆశతో యజమానులు సృష్టిస్తున్న కృత్రిమ కొరతనా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి బంకుల్లో తనిఖీలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు, ఎల్పీజీ గ్యాస్ కోసం ఆటో డ్రైవర్ల కష్టాలు వర్ణనాతీతం. లక్డీకాపూల్ వంటి రద్దీ ప్రాంతాల్లో వందలాది ఆటోలు కిలోమీటర్ల మేర క్యూ కట్టడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గంటల తరబడి నిరీక్షణతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతినడమే కాకుండా, ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. యుద్ధం కారణంగా సరఫరా దెబ్బతిందని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో తలెత్తిన ఈ ఇంధన సంక్షోభం సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేస్తోంది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, అమీర్‌పేట, ఖైరతాబాద్ వంటి ప్రధాన ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. అకస్మాత్తుగా పెరిగిన డిమాండ్‌తో పలు చోట్ల 'నో స్టాక్' బోర్డులు దర్శనమివ్వడం వాహనదారుల్లో ఆందోళన నింపింది. మరోవైపు, లక్డీకాపూల్ వంటి ప్రాంతాల్లో ఎల్పీజీ గ్యాస్ కోసం వందలాది ఆటోలు గంటల తరబడి వేచి చూడటంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ ఇంధన కొరత వదంతుల వల్ల సామాన్యుల జనజీవనం, ఆటో కార్మికుల ఉపాధి తీవ్రంగా దెబ్బతిన్నాయి.

**పౌరసరఫరాల శాఖ క్లారిటీ**

గత కొన్ని రోజుల నుంచి పలు పెట్రోల్, ఎల్పీజీ బంకులలో నో స్టాక్ బోర్డులు కనిపిస్తుండగా.. కొన్నిచోట్ల కిలోమీటర్ల మేర క్యూ లైన్లు ఉంటున్నాయి. రాష్ట్రంలో ఇంధన కొరత ఉందని మంగళవారం నాడు హైదరాబాద్‌లో పలు పెట్రోల్ బంకుల వద్ద పరిస్థితి చూపించేలా వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, దీనిపై తెలంగాణ పౌరసరఫరాల శాఖ స్పందించి. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ వంట గ్యాస్ నిల్వలకు ఎలాంటి కొరత లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది.గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాల వల్ల ప్రజలు భయాందోళనలకు గురై పెట్రోల్ బంకుల వద్ద క్యూ కడుతున్నారని, దీనివల్ల అనవసర రద్దీ ఏర్పడుతోందని అధికారులు చెబుతున్నారు. రిఫైనరీల నుండి ఇంధన సరఫరా సక్రమంగా జరుగుతోందని, ప్రజల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి అకస్మాత్తుగా పెట్రోల్ బంకులకు వెళ్లి కొనుగోళ్లు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**ఫుల్ స్టాక్.. డీలర్స్ అసోసియేషన్**

తెలంగాణ పెట్రోలియం డీలర్ల అసోసియేషన్ కూడా ఈ విషయంపై స్పందించింది. రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని తేల్చి చెప్పింది. హెచ్‌పీసీఎల్ (HPCL), ఐఓసీఎల్, బీపీసీఎల్ వంటి సంస్థల వద్ద తగినంత స్టాక్ ఉందని తెలిపింది. కస్టమర్ల ముందస్తు కొనుగోళ్ల వల్లే క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఇంధన కొరత లేదని పేర్కొంది. సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, ప్రజలు సంయమనం పాటించాలని.. అవసరానికి తగ్గట్లుగా ఫ్యూయల్ ఫిల్ చేసుకోవాలని అసోసియేషన్ కోరింది.

**మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**

రాష్ట్రంలో ఇంధన కొరత ఉందని ప్రచారం జరగడం, పలు పెట్రోల్ బంకులు, ఎల్పీజీ వద్ద ఇంధనం కోసం బైకులు, ఆటోలు కిలోమీటర్ల మేర కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో ఇంధనం, గ్యాస్ సిలిండర్లు, యూరియా నిల్వలపై సీఎం రేవంత్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో అధికారులతో భేటీ అయి ఇంధన సరఫరా నిల్వలపై చర్చించనున్నారు. సరఫరా పెంచడంతో పాటు కొరత అంటూ వదంతులను అరికట్టడంపై ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. మరోవైపు హైదరాబాద్ సీపీ సజ్జనార్ సైతం ఇంధన కొరత లేదని, తగినంత నిల్వలు ఉన్నాయని ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ప్రజలు వదంతులను నమ్మి ట్యాంక్ ఫుల్ చేయించేందుకు పెట్రోల్ బంకులకు ఒక్కసారిగా పోటెత్తకూడదని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## రోహిత్ శర్మ ట్రోఫీ కింగ్

◇◇◇◇◇◇◇◇◇◇◇

ముంబైకి ఐదు టైటిల్స్ అందించిన కెప్టెన్‌గా ప్రత్యేక గుర్తింపు.



# దక్షిణాదికి నష్టం ఎక్కడుంది..?

- **లోక్ సభ సీట్లు పెంపుపై కేంద్ర మంత్రి బండి సంజయ్**
- **ప్రాంతీయ అసమానతల పేరుతో ప్రజలను విడదీసే కుట్ర**
- **సీఎం రేవంత్ రెడ్డిపై బండి ధ్వజం**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
సీఎం రేవంత్ రెడ్డి ప్రాంతీయ అసమానతల పేరుతో ప్రజలను విడదీయాలని చూస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తే సీఎంకు వచ్చిన నష్టమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి మహిళలంటేనే ద్వేషం అన్న కేంద్రమంత్రి అందుకే 50 ఏళ్ల పాలనలో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు కాపీలను చింపిన ఆర్జేడి, సమాజ్‌వాది పార్టీలతో అంటకాగుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా మహిళా రిజర్వేషన్‌లను అమలు చేసి తీరుతామని బండి సంజయ్ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచితే దక్షిణాదికి జరిగే నష్టమేంటని బండి సంజయ్ నిలదీశారు. ప్రతి రాష్ట్రంలోనూ 50 శాతం సీట్లను పెంచితే అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. ఇంకెన్నాళ్లు ప్రాంతీయ అసమానతల పేరు చెప్పి చలి కాచుకుంటారని ప్రశ్నించారు. మీలో దేశభక్తి, జాతీయవాదం మచ్చుకైనా కన్పించవా అని ధ్వజమెత్తారు. దేశాన్ని విభజించే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే వణుకు సీఎంలో మొదలైందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా అక్కడ కాంగ్రెస్ పాచికలు పారడం లేదని అర్థమైందని, అందుకే దక్షిణాదికి అన్యాయం అంటూ కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. త్వరలోనే తమిళనాడు, కేరళ ప్రజలు కాంగ్రెస్ భాగస్వామ్య పక్షాలకు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# ఆందోళన వద్దు..

- **రాష్ట్రంలో రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలున్నాయి**
- **కమర్షియల్ గ్యాస్ కొరతపై కేంద్రంతో చర్చలు జరుపుతున్నాం**
- **రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రెండునెలలకు సరిపడా నిల్వలున్నాయని వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ లభ్యతపై ఆందోళన చెందవద్దని ప్రజలకు సూచించారు. ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద వాహనాల రద్దీ అమాంతం పెరిగింది. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హైదరాబాద్ లో అయితే పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఫుల్ ట్యాంకులు చేయించుకోవడమే కాక.. డ్రమ్ములు, క్యాన్లు, కంటైనర్లలోనూ పెట్రోల్, డీజిల్ ను నింపుకుంటున్నారు. అవసరానికి మించి కొనుగోలు చేస్తుండటంతో బంకుల్లో ఇంధనం నిండుకుని నో స్టాక్ బోర్డులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్ బంకుల వద్ద క్యూ కట్టవద్దని సూచించారు. రాష్ట్రంలో రెండు నెలలకు సరిపడా ఇంధన నిల్వలున్నాయని స్పష్టం చేశారు. డ్రమ్ములు, కంటైనర్లలో పెట్రోల్ నింపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అయితే వాణిజ్య గ్యాస్ కు కొంత ఇబ్బంది ఉందన్నది వాస్తవమేనని చెప్పారు. దీనిపై కేంద్రంతో చర్చలు జరుపుతున్నామని వివరించారు. హైదరాబాద్ లో కొందరు పుట్టించిన పుకార్ల కారణంగానే ఈ పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రజలు

**సరఫరా ఆగలేదు : తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్**
రాష్ట్రంలో ఇంధన కొరత ఏ మాత్రం లేదని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ప్రకటించింది. కొరత ఉందనే పుకార్లతో ప్రజలు అనవసరంగా బంకుల వద్ద క్యూ కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం హెచ్ పీ సీఎల్,, ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్ వంటి కంపెనీల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని బుధవారం ప్రకటనలో తెలిపింది. సరఫరా గొలుసు ఎక్కడా ఆగలేదన్న అసోసియేషన్.. కొరత భయంతో ప్రజలు ఒక్కసారిగా కొనుగోలు చేయడంతో సాధారణం కంటే 2.5 నుండి 3 రెట్లు విక్రయాలు పెరిగాయన్నారు. ఫలితంగా కొన్ని బంకుల్లో తాత్కాలికంగా స్టాక్ అయిపోవచ్చని అభిప్రాయపడింది. అంతే తప్ప ఎక్కడా కొరత లేదన్నారు. పెట్రోల్ లేదా డీజిల్‌ను డబ్బాల్లో, క్యాన్లలో నింపి నిల్వ చేయడం పెస్కో నిబంధనలకు విరుద్ధమని తెలిపింది. ఇది చాలా ప్రమాదకరమనీ అగ్ని ప్రమాదాలకు దారి తీయవచ్చని హెచ్చరించింది. ప్రజలు తమకు అవసరమైనంత మేరకే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వ చేయవద్దని అసోసియేషన్ కోరింది.

# దమ్ముంటే నువ్వే పోటీ చేయ్..



- **సీఎం రేవంత్ కు మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్**
- **ఎవరు పోటీ చేసినా నా పైనే సిద్దిపేట ప్రజల ఆశీర్వాదం**
- **రెండో సారి సీఎం.. రేవంత్ కల**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ చేశారు. తనను ఓడించిన వారికి మంత్రి పదవి ఇస్తామని చెప్పిన సీఎం వారిని వీరిని రంగంలో దింపకుండా ఆయనే స్వయంగా తనతో తలపడాలని ఛాలెంజ్ చేశారు. ఎవరు పోటీ చేసినా సిద్దిపేట ప్రజల ఆశీర్వాదం తనపైనే ఉంటుందన్నారు. బుధవారం అసెంబ్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన రేవంత్ రెడ్డి మళ్లీ తాను సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని చెప్పారు. కానీ ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది సాధ్యం కాదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన ఆయన రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో తమకు బాగా తెలుసన్నారు. సమయం వచ్చినప్పుడు తమ సత్తా చాటుతామని హరీష్‌రావు హెచ్చరించారు.. రేవంత్ రెడ్డికి ఇదే ఆఖరి టర్మ్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమనీ కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా రేవంత్ రెడ్డి మోసం చేశారని ధ్వజమెత్తారు. హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజనతో బీఆర్ఎస్ పార్టీకే మేలు జరుగుతుందని విశ్లేషించారు. అయితే.. కుటుంబ నియంత్రణను పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థికంగా, రాజకీయంగా నష్టం జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరుతారనే ప్రచారంపై స్పందిస్తూ.. ఆయన వస్తారో లేదో చూడటమే బాగుంటుంది, ఇప్పుడే చెప్పడం కంటే వేచి చూడటం ఉత్తమం అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# పేదల సంక్షేమంపై చర్చకు రండి

- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎన్ని కోట్లయినా ఇస్తాం**
- **వారం వారం బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం సిద్ధం**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలోని పేదల సంక్షేమం గురించి అసెంబ్లీలో వినడానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులకు మనసు లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. అందుకే బడ్జెట్ సమాధానం వినకుండా సభ నుంచి పారిపోయారని విమర్శించారు. బుధవారం అసెంబ్లీలో 'ప్రశ్నోత్తరాల సమయం'లో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. "బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి నిధులు తగ్గించామంటూ విపక్షాలు మాట్లాడడం సరికాదన్నారు. గత బడ్జెట్‌లోనే ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఏకంగా రూ.22,500 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా సభలు నిర్వహించి పారదర్శకంగా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. హౌసింగ్ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని భట్టి తెలిపారు. పనులు వేగవంతం చేసేందుకు గతంలో లాగా నెలల తరబడి వేచి చూడకుండా, వారానికోసారి బిల్లులు చెల్లించేలా నిక్కచ్చిగా ఆదేశాలు జారీ చేశామన్నారు. "ఇల్లు కట్టండి.. బిల్లు తీసుకోండి" అనే నినాదంతో లబ్ధిదారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదన్నదే తమ ప్రభుత్వ ఆశయమని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న ఉన్నత లక్ష్యంతోనే భారీగా నిధులు కేటాయించామన్నారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేదల కోసం వెనకడుగు వేయలేదనీ ఇంతటి సాహసోపేత నిర్ణయం తీసుకున్న ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి, విమర్శలు చేయడం సమంజసం



కాదని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం కావాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు రూ.5వేల కోట్లు దాటలేదని, ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇళ్ల నిర్మాణం ఎంత వేగంగా జరిగితే, అంత త్వరగా నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు.



## కళ్యాణం.. కమనీయం

**ముద్ర కూకట్‌పల్లి:**
కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామిదేవాలయంలో 35వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా కోసూరి రామకృష్ణమా చార్యుల పర్యవేక్షణలో స్వామివారి శాంతి కళ్యాణ మహోత్సవం వేద మంత్రోచ్చరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివేకానంద నగర్ కాలనీ అధ్యక్షులు వడ్డేపల్లి రాజేశ్వరరావు - యామిని దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొన్న వారు, భక్తులతో కలిసి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## ఘనంగా రామ మందిర పునర్నిర్మాణ మహోత్సవం

**ముద్ర, తాండూర్ :**
తాండూర్ పట్టణంలోని ఇందిరా నగర్ లో వెలసిన ఏకైక శ్రీ రామ మందిర పునర్నిర్మాణ మహోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామ, లక్ష్మణ మరియు హనుమంతుని విగ్రహాల ప్రాణ ప్రతిష్టతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఇందిరా నగర్ కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి మహిళలు, యువకులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



# కాంగ్రెస్ నేత ఇంటిముందు ఆత్మహత్యాయత్నం

- **వ్యక్తి ఆత్మహత్యాయత్నం**
- **తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వడం లేదని ఒంటిపై పెట్రోల్ పోసుకొని అఘాయిత్యం**



**ముద్ర , మోత్కూర్:**
మోత్కూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్ ఇంటి ఎదుట ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలలోకి వెళితే.. మోత్కూరు మండలం ముశిపట్ల శివనగర్ కు చెందిన కోమటిరెడ్డి ప్రభాకర్ రెడ్డి 2022లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్ కు రూ.15 లక్షలు అప్పుగా ఇచ్చాడు. 2023లో రామచంద్ర రూ.10 లక్షలు ప్రభాకర్ రెడ్డికి తిరిగి ఇచ్చి మరో రూ. 5 లక్షలు 6 నెలల్లో ఇస్తానని అప్పు కాగితం రాసుకున్నాడు. రోజులు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదని, రేపు మాపంటూ తిప్పుకుంటున్నాడని బాధితుడు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. తాను ఇతరులకు డబ్బులు ఇచ్చేది ఉందని వాళ్ళు ఒత్తిడి చేస్తున్నారని, తన కుటుంబం ఇబ్బందుల్లో ఉందని, ఎంతగా బ్రతిమాలి అడిగినా పట్టించుకోవడం లేదని, తనకు గత్యంతరం లేకనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు.

# చేనేత కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తాం

- **ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**ముద్ర, హైదరాబాద్ :**
హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ చేనేతలకు ఆర్థిక, రాజకీయ అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీలు ఎల్ రమణ, నెల్లికంటి సత్యం, తీన్మార్ మల్లన్న తదితరులు మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత ముఖ్యమైన చేనేత రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. త్రిఫ్ట్ పథకంలో బకాయిలు చెల్లించాలని, 202627 బడ్జెట్‌లో చేనేత రంగానికి భారీ నిధులు కేటాయించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ చేనేత రంగానికి సంబంధించిన పథకాలను రద్దు చేయడం, జీఎస్టీ విధించడం వల్ల పరిశ్రమ తీవ్రంగా దెబ్బతిన్నదని అన్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేసి, జీరో వడ్డీతో కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఆరోగ్య బీమా, సబ్సిడీలు, గుర్తింపు కార్డులు అందించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటం కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేనేత రంగాన్ని రక్షించాలని వారు డిమాండ్ చేశారు.చేనేత పవర్ లూమ్ కార్మికులందరికీ రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు

ఈ ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, లల్లెల బాలకృష్ణ,పైళ్ల ఆశయ్య , చేనేత కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసి కంటి లక్ష్మీనరసయ్య,ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చోళ రాజేశం రాష్ట్ర అధ్యక్షులు బాసాబత్తిని రాజేశం, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఫిరాయింపుల కేసులో హైకోర్టు జోక్యం

- **ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు**
- **క్లీన్ చిట్ ఇచ్చిన అసెంబ్లీ స్పీకర్ కూ నోటీసులు**
- **కౌంటర్ దాఖలు చేయాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు**
- **విచారణ వచ్చే నెల 16కు వాయిదా**




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తోన్న ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు వ్యవహారం కొత్త మలుపు తీసుకున్నది. పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు రాష్ట్ర హైకోర్టు నోటీసులు ఇచ్చింది.. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ సైతం హైకోర్టు నోటీసులు జారీ చేసింది.. పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల స్పీకర్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ హైకోర్టులో సవాల్ చేసింది. దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం, బండ్ల కృష్ణమహన్‌రెడ్డి, తెల్లం వెంకట్రావులపై పిటిషన్ దాఖలైంది.. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఏడుగురు ఎమ్మెల్యేలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరణతో కౌంటర్ దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. విచారణ వచ్చే నెల 16కు వాయిదా వేసింది. మరోవైపు.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఇటీవల హైకోర్టు నోటీసులు ఇచ్చింది. బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది. దానం పార్టీ మారిన వ్యవహారంపై స్పీకర్ తీర్పును కొట్టేయాలని పిటిషన్‌లో ఏలేటి కోరారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం.. కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. కర్ణాటక, బిహార్‌లో ఇలాంటి పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్‌తో పాటు అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కాగా పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు జోక్యం చేసుకోవడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది. స్పీకర్ కార్యాలయం నుంచి వచ్చే స్పందన, ఎమ్మెల్యేలు ఇచ్చే కౌంటర్ అఫిడవిట్లపై ఈ కేసు భవిష్యత్తు ఆధారపడి ఉన్నట్లు తెలుస్తుంది. న్యాయస్థానం ఈ సంచలన కేసు తదుపరి విచారణను వచ్చే నెల 16 కు వాయిదా వేయడంతో, అప్పటి వరకు ఈ ఉత్కంఠ కొనసాగనుంది. ఇదిలా ఉంటే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా ఎమ్మెల్యే దానం నాగేందర్ కు, స్పీకర్ కు కోర్టు నోటీసులు ఇచ్చింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
26.03.2026 గురువారం, హైదరాబాద్
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# అగ్రరాజ్యం 'అడుగు' వెనక్కి!



- **ఇరాన్ హెచ్చరికల ధాటికి ట్రంప్ తలవంచక తప్పలేదా?**

అంతర్జాతీయ రాజకీయ యవనికపై అగ్రరాజ్యం అని పిలవబడే అమెరికా అహంకారం మరోసారి మట్టికరిచినట్లు కనిపిస్తోంది. ప్రపంచ పోలీస్ అని విర్రవీగే డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేస్తానంటూ చేసిన ప్రగల్భాలు ఇప్పుడు నీటి మూటలయ్యాయి. ఇరాన్ గడ్డపై చేయి వేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న టెహ్రాన్ హెచ్చరికల ధాటికి, వైట్ హౌస్ తన దూకుడును తగ్గించుకోవడం గమనార్హం. ఇది కేవలం వ్యూహాత్మక వెనకడుగు కాదు, ఇరాన్ రక్షణ శక్తి ముందు అగ్రరాజ్యం అశక్తతకు నిదర్శనం అని ఇరాన్ అధికారిక మీడియా ఐఆర్ఐబి (IRIB) ఘాటుగా విశ్లేషిస్తోంది. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో అమెరికా గుత్తాధిపత్యానికి పగుళ్లు పడుతున్నాయని చెప్పడానికి ఒక నిఖార్సైన ఉదాహరణ.

**దాడుల బెదిరింపులు - దిగజారిన అమెరికా నైతికత**

ఒక దేశం యొక్క మౌలిక సదుపాయాలను, ముఖ్యంగా సామాన్యుల జీవితాలతో ముడిపడి ఉన్న విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించడం ట్రంప్ నైతిక దిగజారుడుతనానికి పరాకాష్ట. యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో సైనికుల మధ్య జరిగేది కాదు, అది దేశ ఆర్థిక వెన్నెముకను విరిచే కుట్రగా అమెరికా భావించింది. ఒక దేశాన్ని అంధకారంలోకి నెట్టడం ద్వారా ఆ దేశ ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీయవచ్చని ట్రంప్ భావించి ఉండవచ్చు. కానీ, ఇరాన్ ఈ బెదిరింపులకు బెదరలేదు. తమ దేశ సార్వభౌమాధికారంపై దాడి జరిగితే, అది అమెరికా ప్రయోజనాలకు ప్రపంచవ్యాప్తంగా సమాధి కడుతుందని ఇరాన్ రాయబార కార్యాలయాలు స్పష్టం చేశాయి. ఈ హెచ్చరికల వెనుక ఉన్న నిఖార్సైన సైనిక సన్నద్ధతను చూసి ట్రంప్ బృందం అప్రమత్తమైంది. అగ్రరాజ్యం వేసే ప్రతి అడుగుకు ప్రతిగా ఇరాన్ క్షిపణులు సిద్ధంగా ఉన్నాయని గ్రహించిన తర్వాతే ట్రంప్ తన వ్యాఖ్యల నుండి వెనక్కి తగ్గారు.

**వ్యూహాత్మక లొంగుబాటా? భయమా?**

అఫ్ఘానిస్థాన్‌లోని ఇరాన్ ప్రతినిధులు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ తన ప్రకటన నుండి వెనక్కి తగ్గడం అనేది అంతర్జాతీయ సమాజం ముందు ఆయనకు జరిగిన ఘోర పరాభవం. ఒకవైపు ఇజ్రాయెల్‌కు వత్తాసు పలుకుతూ మధ్యప్రాచ్యాన్ని అగ్నిగుండంగా మారుస్తున్న అమెరికా, ఇరాన్ విషయంలో మాత్రం ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోంది. ఇరాన్ వద్ద ఉన్న అధునాతన క్షిపణి వ్యవస్థ, డ్రోన్ టెక్నాలజీ అగ్రరాజ్యానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ కేంద్రాలపై ఒక్క దాడి జరిగినా, దానికి ప్రతిగా పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా నౌకాదళం నామరూపాలు లేకుండా పోతుందన్న భయం ట్రంప్‌ను వెంటాడి ఉండవచ్చు. ఇది అమెరికా యొక్క బలహీనతను మాత్రమే కాకుండా, ఇరాన్ యొక్క ప్రతిఘటన శక్తిని ప్రపంచానికి చాటిచెప్పింది. ఏ దేశమైనా సరే, తన రక్షణ కోసం ప్రాణాలకైనా తెగిస్తుందని ఇరాన్ నిరూపించింది.

**అంతర్జాతీయ చదరంగంలో ఇరాన్ పైచేయి**

దశాబ్దాలుగా పశ్చిమ దేశాల ఆంక్షలను తట్టుకుని, తన స్వయంప్రతిపత్తిని కాపాడుకుంటున్న ఇరాన్, ఇప్పుడు దౌత్యపరంగా కూడా అమెరికాను ఇరకాటంలో పెట్టింది. విద్యుత్ కేంద్రాలపై దాడి అనేది యుద్ధ నేరం కిందకు వస్తుందని ఐక్యరాజ్యసమితి వేదికగా అమెరికాను ఎండగట్టడంలో ఇరాన్ విజయం సాధించింది. ట్రంప్ ప్రకటన వెనక్కి తీసుకోవడం అనేది కేవలం మాటల మార్పు కాదు, అది ఇరాన్ రక్షణ కవచం ముందు అమెరికా ఆయుధ బలహీనతకు నిదర్శనం. అమెరికా తన గుత్తాధిపత్యాన్ని ప్రదర్శించాలని చూసిన ప్రతిసారీ, ఇరాన్ వంటి దేశాలు గట్టి ఎదురుదాడితో బుద్ధి చెబుతూనే ఉన్నాయి. అగ్రరాజ్యాలు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి చేసే ప్రయత్నాలు చిన్న దేశాల ఐక్యత ముందు పని చేయవని ఇక్కడ స్పష్టమవుతోంది.

**అగ్రరాజ్యానికి గట్టి హెచ్చరిక**

మధ్యప్రాచ్యంపై పట్టు కోసం అమెరికా ఆడుతున్న నాటకాలు ఇక సాగవని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ట్రంప్ వెనక్కి తగ్గడం అనేది ప్రపంచ శాంతికి తాత్కాలికంగా శుభపరిణామమే అయినప్పటికీ, ఇది అగ్రరాజ్య బలహీనతను ఎండగట్టింది. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చి, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని బెదిరించే 'రౌడీయిజం' ఇకపై చెల్లదు. ఇరాన్ చూపిన తెగువ, హెచ్చరించిన తీరు అగ్రరాజ్యానికి ఒక గుణపాఠం కావాలి. ఒక దేశం యొక్క ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తామన్న అహంకారపూరిత వ్యాఖ్యలు చేసే ముందు, ఆ దేశం యొక్క ఆత్మగౌరవాన్ని తక్కువ అంచనా వేయకూడదని ట్రంప్ తెలుసుకోవాలి. అగ్రరాజ్యం తన అహంకారాన్ని వీడి, ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించకపోతే, భవిష్యత్తులో మరిన్ని పరాభవాలు తప్పవని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ సాధించిన ఈ దౌత్యపరమైన విజయం, ప్రపంచవ్యాప్తంగా అగ్రరాజ్యాల పీడనను ఎదుర్కొంటున్న దేశాలకు ఒక స్ఫూర్తిగా నిలుస్తుంది



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ 9848559863

## యుద్ధ కాంక్ష ఓ మానసిక రుగ్మత

మనిషి
మరో మనిషిని సృష్టించే కాలానికి
వేగంగా ఎగబాకుతున్న రోజులివి
కృత్రిమ మేధ ప్రపంచ శిఖరంపై
ప్రభావిస్తూ... విస్తరిస్తున్న ఆధునికం ఇది
దేశాన్ని మరో దేశం ధ్వంసం చేసే
వికృత ప్రళయ ఘడియలు కూడా ఇవే...
నవ్వుకోవాలి...
నైతిక వివేచన చచ్చిపోతున్నందుకు
దుఃఖించాలి...
నాగరికత విన్యాసాలతో నాశనం
చేస్తున్నందుకు
యుద్ధోన్మాద క్రూరత్వం జడలు విప్పుతోంది
ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ధ్వంస రచన చేస్తోంది
ప్రపంచాన్ని అగ్నిపర్వతం మీద నిలబెట్టే
కలహశీల మృగతృష్ణ రాక్షస క్రీడై పెచ్చరిల్లుతోంది
ఒకవైపు ...
గాజా ఊచకోత ఇంకా రక్తమొడుతూనే వుంది
దాహం తీరని రక్తనాలుకలు
కోరలు చాస్తూనే ఉన్నాయి
అప్పుడు సద్దాం హుస్సేన్.. మహ్మద్ గఢాఫీ...
ఇప్పుడు అయతుల్లా అలీ ఖమేనీ
క్షిపణుల..డ్రోన్ల..వైమానిక దాడుల్లో..
నిర్దాక్షిణ్యంగా..అనేకానేక ప్రాణాలు భూస్థాపితం
అంతా...
ట్రంప్ టెంపరి తనాల్లోకి..
నేతన్యాహు తుంటరి తనాల్లోకి...
దేశ సరిహద్దులు పిచ్చి గీతలు గీస్తున్న
వికృత హేల ఇప్పుడు ప్రపంచ పటం పై...
అణ్వాయుధాల బూచితో..
సార్వభౌమ దేశాల్ని బలిపశుల్ని చేస్తూ..
ఓ కుతంత్రాల ఎత్తుగడ వాడిది
కన్నుపడ్డ దేశాన్ని వల్లకాడు చేసి
రెక్కల్ని అల్లార్చుకునే రాబంధువు వాడు...
సుభిక్ష సామ్రాజ్యాల సర్వనాశనాల్లో
పురాణ హితిహాసాల హితోపదేశాలు
అప్పడేనా... ఇప్పడైనా
కళ్ళకు కట్టే సత్యం ఒక్కటే....
అనైతికత రాజ్యమేలి నప్పడు
యుద్ధాలు
పురివిప్పి విలయ తాండవం చేస్తాయి
సుస్థిర శాంతిని ఛిద్రం చేసే
యుద్ధ కాంక్ష ఓ మానసిక రుగ్మత..!
ఎవరైనా.. అంతిమంగా
అలెగ్జాండర్ రిక్తహస్తాల
చరిత్ర ఎరగాలి..!!



డా.కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

# ఇద్దరి అహంకారం వల్లే యుద్ధం...!

- **రిటైర్మెంట్ హక్కులకు హైకోర్టు రక్షణ కవచం...**
- **ఏప్రిల్ 9 డెడ్‌లైన్: రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులపై హైకోర్టు కఠిన ఆదేశాలు**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల విషయంలో నెలకొన్న జాప్యం, నిర్లక్ష్యం, పరిపాలనా లోపాలపై రాష్ట్ర హైకోర్టు గట్టిగా స్పందించడం ఇటీవలి కాలంలో పరిపాలనా వ్యవస్థపై పెద్ద చర్చకు దారి తీసింది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించిన తర్వాత, వారికి రావాల్సిన గ్రాట్యుటీ, పింఛన్, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి బకాయిలు నెలలు, కొన్ని సందర్భాల్లో సంవత్సరాలపాటు పెండింగ్‌లో ఉండడం ఒక తీవ్రమైన సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో, ఏప్రిల్ 9లోగా అన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం ప్రాధాన్యంగా మారింది.

ఈ కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే, రాష్ట్రంలోని పలు శాఖలకు చెందిన పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించక పోవడంతో కోర్టును ఆశ్రయించడం ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి రిటైర్ అయిన ఉద్యోగులు ఈ సమస్యను తీవ్రంగా ప్రస్తావించారు. కొందరికి 6 నెలలు, మరికొందరికి 1-2 సంవత్సరాలపాటు కూడా బకాయిలు అందకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాదించారు. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్లను విచారించిన హైకోర్టు, ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

హైకోర్టు తన పరిశీలనలో ఒక కీలకమైన అంశాన్ని ప్రస్తావించింది—పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు, దయాధర్మం కాదు. పదవీ విరమణ పొందిన వెంటనే బకాయిలు చెల్లించడం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు గత తీర్పులను కూడా ఉటంకిస్తూ, పెన్షన్ చెల్లింపుల్లో జాప్యం రాజ్యాంగంలోని హక్కులను ఉల్లంఘించడమేనని పేర్కొంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న ఉద్యోగులు తమ జీవితావసరాలకు ఈ నిధులపై ఆధారపడతారని, ఆలస్యం చేయడం వారి గౌరవాన్ని దెబ్బతీస్తుందని కోర్టు అభిప్రాయ పడింది.

గణాంకాలను పరిశీలిస్తే, రాష్ట్రంలో ప్రతి ఏడాది సుమారు 60 వేల నుండి 80 వేల వరకు ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారు. వీరిలో కనీసం 30-40 శాతం మంది రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులో ఆలస్యం ఎదుర్కొంటున్నట్లు అంచనా. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభం, ఖజానా లోటు, ప్రాధాన్యతల మార్పు వంటి కారణాలతో ఈ చెల్లింపులు వాయిదా పడుతున్నాయి. ఒక అంచనా ప్రకారం, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తం విలువ వేల కోట్ల రూపాయలకు చేరుకుంటోంది. ఇందులో గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డిఎ బకాయిలు ముఖ్యమైనవి.

హైకోర్టు ఈ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, "ఉద్యోగి సేవలు తీసుకున్న తర్వాత, అతనికి రావాల్సిన న్యాయబద్ధమైన హక్కులను ఎందుకు నిలిపివేస్తున్నారు?" అని నిలదీసింది. ప్రభుత్వం తరఫున న్యాయవాదులు ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపించినప్పటికీ, కోర్టు దానిని సరైన సమాధానంగా అంగీకరించలేదు. ప్రజల సేవల కోసం పని చేసిన ఉద్యోగులకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా ఉండాలని పేర్కొంది. అంతేకాకుండా, ఈ చెల్లింపులను ఏప్రిల్ 9లోగా పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించడం ద్వారా పరిపాలనా యంత్రాంగంపై ఒత్తిడి పెంచింది.

ఈ ఆదేశాల ప్రభావం పరిపాలనా వ్యవస్థపై గణనీయంగా పడే అవకాశం ఉంది. మొదటిగా, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయాల్సిన అవసరం ఉంటుంది. రెండవది, భవిష్యత్తులో ఇలాంటి జాప్యాలు జరగకుండా ఆర్థిక ప్రణాళికను మెరుగుపరచాల్సి ఉంటుంది. మూడవది, డిజిటల్ పద్ధతుల్లో పింఛన్ ప్రాసెసింగ్‌ను వేగవంతం చేయడం, బాధ్యతలను స్పష్టంగా నిర్వచించడం అవసరం అవుతుంది.

ఇక ఉద్యోగుల కోణంలో చూస్తే, ఈ తీర్పు వారికి ఒక నైతిక బలం ఇచ్చింది. కోర్టు జోక్యం వల్ల తమ సమస్యలు పరిష్కారం దిశగా వెళ్లే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. ఉద్యోగ సంఘాలు కూడా ఈ తీర్పును స్వాగతిస్తూ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని సంఘాలు ఇప్పటికే పెండింగ్ బకాయిలపై వడ్డీ చెల్లించాలని కూడా కోరుతున్నాయి.

అయితే, ప్రభుత్వానికి ఇది ఒక ఆర్థిక సవాలు కూడా. పెద్ద మొత్తంలో నిధులు తక్షణం సమీకరించడం, ఇతర అభివృద్ధి పనులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయినప్పటికీ, హైకోర్టు ఆదేశాలు చట్టబద్ధంగా అమలు చేయాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్ పునర్వ్యవస్థీకరణ, అప్పుల సమీకరణ, ఖర్చుల నియంత్రణ వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

ఇది కేవలం ఒక చట్టపరమైన అంశం మాత్రమే కాదు, పరిపాలనా నైతికతకు సంబంధించిన విషయం కూడా. ఉద్యోగుల సేవలను గౌరవించడం, వారికి సమయానికి హక్కులను అందించడం మంచి పాలనకు సూచిక. ఈ సంఘటన ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

మొత్తం మీద, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. ఇది ఉద్యోగుల హక్కులను రక్షించడమే కాకుండా, పరిపాలనా వ్యవస్థలో బాధ్యతను పెంపొందించే దిశగా ఒక కీలకమైన అడుగు. ప్రభుత్వం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణతో పాటు పారదర్శక విధానాలను అమలు చేస్తే, భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు తగ్గే అవకాశం ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# బోధనలో శిఖరం_ _ _ బెల్లి యాదయ్య

- **బడిపంతుల నుంచి ప్రొఫెసర్ పీఠం వరకు**


నకిరేకల్ మట్టిలో పుట్టి, అక్షరాన్నే ఆయుధంగా మలచుకొని, సామాన్య 'బడిపంతులు' స్థాయి నుంచి అత్యున్నత 'ప్రొఫెసర్' స్థాయికి ఎదిగిన డాక్టర్ బెల్లి యాదయ్య జీవితం ఒక సజీవ కావ్యమ్. 38 ఏళ్ల సుదీర్ఘ విద్యా ప్రస్థానంలో ఆయన సాధించిన విజయాలు నేటి తరానికి ఒక గొప్ప పాఠం.

**విద్యా సేవలో అరుదైన ప్రస్థానం**

గ్రామ పాఠశాలలో బడిపంతులుగా ప్రారంభమైన బోధన జీవితం_ _ _ నిరంతర అధ్యయనం, పట్టుదల, అంకితభావంతో ప్రొఫెసర్ స్థాయికి ఎదిగిన అరుదైన ప్రయాణం. అదే బెల్లి యాదయ్య గారి జీవన గాథ. బోధనను సేవగా భావించిన గురువు, కలంతో సమాజాన్ని మేల్కొలిపిన రచయిత, సామాజిక చైతన్యానికి వేదికగా నిలిచిన ప్రజాబుద్ధిజీవి——ఈ మూడు రంగాల్లో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ముప్పై ఎనిమిది సంవత్సరాలపాటు విద్యా రంగంలో సేవలందించిన ఆయనకు ఇటీవల కళాశాల విద్యాశాఖ ప్రొఫెసర్ పదోన్నతి కల్పించడం ఆయన కృషికి లభించిన గౌరవంగా నిలిచింది.

**గ్రామీణ బాలుడి విద్యా ప్రయాణం**

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం పాలెం గ్రామంలో చంద్రమ్మ, సాయిలు దంపతులకు 1968 జూన్ 20న బెల్లి యాదయ్య జన్మించారు. గ్రామీణ వాతావరణంలో పెరిగినా చదువుపై ఆసక్తి చిన్ననాటి నుంచే పెంపొందింది. పాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రారంభమైన విద్యాభ్యాసం నోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగింది. అనంతరం నల్లగొండలోని గీతా విజ్ఞాన ఆంధ్ర కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు.తెలుగు భాషపై మక్కువ ఆయనను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పీఠం వరకు తీసుకెళ్లింది. ఎం.ఏ. (తెలుగు)లో ప్రథమ ర్యాంక్ సాధించి "అజంతా స్వప్నలిపి - ఒక పరిశీలన" అంశంపై ఎం.ఫిల్ పూర్తి చేశారు. తరువాత "నగ్నముని రచనలు - ఒక పరిశీలన" అంశంపై పిహెచ్.డి సాధించారు.



**బడిపంతులుగా ప్రారంభమైన బోధన**

1987లో నకిరేకల్‌లోని విజ్ఞాన విద్యామందిర్ పాఠశాలలో రెండో తరగతి క్లాస్ టీచర్‌గా ఆయన బోధన జీవితాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో ఆయన అర్హతలు DOL, TPT మాత్రమే. చిన్నారులకు పాఠాలు చెప్పిన ఆ తొలి అడుగు తరువాత నిరంతర సాధనతో ముందుకు సాగారు. ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా నాలుగు సంవత్సరాలు, ప్రైవేట్ లెక్చరర్‌గా ఆరు సంవత్సరాలు సేవలందించారు. అనంతరం ప్రభుత్వ రంగంలో లెక్చరర్‌గా ఇరవై ఏడు సంవత్సరాలకు పైగా పనిచేశారు. విజ్ఞాన విద్యామందిర్ నకిరేకల్, అభ్యుదయ గురుకుల పాఠశాల మూసీప్రాజెక్ట్, ఏవీఎం డిగ్రీ కళాశాల నకిరేకల్, కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కోదాడ, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) నల్లగొండ, శ్రీ ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొండనాగుల, నాగార్జున ప్రభుత్వ కళాశాల నల్లగొండ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట వంటి పలు విద్యాసంస్థల్లో సేవలందించారు. ప్రస్తుతం నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ మరియు ప్రధానాచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కళాశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఆయనకు ప్రొఫెసర్ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం ఆయన బోధన ప్రయాణంలో కీలక ఘట్టంగా నిలిచింది.

**సాహిత్యరంగంలో ప్రత్యేక ముద్ర**

బోధనతో పాటు సాహిత్యరంగంలో కూడా బెల్లి యాదయ్య విశిష్ట స్థానం సంపాదించారు. వచన కవిత, గేయం, పద్యం, కథ, యాత్రా రచన, విమర్శ వంటి విభిన్న ప్రక్రియల్లో ఆయన రచనలు వెలువడ్డాయి.

**ఆయన రచించిన పుస్తకాలలో**

"నేను గొర్రెల కాస్తుంటాను", "బోధివృక్షం", "విభాజకం", "తర్జుమా", "మా ఊరు అట్లా లేదు", "రెక్కల మనిషి", "చదువుల కల", "పిల్లలకేం కావాలి - పిల్లలేం కావాలి", "కలవస్తే బాగుండును", "పదార్థం" వంటి రచనలు ప్రముఖంగా నిలిచాయి.

**అవార్డులు, గౌరవాలు**

ఆయన సాహిత్య, విద్యా సేవలకు అనేక పురస్కారాలు లభించాయి. మయూరి కళాసమితి రాష్ట్రస్థాయి కవితా పోటీలో ప్రథమ బహుమతి (1992), ఆంధ్రభాషాభూషణ స్వర్ణపతకం (1994), రంజని కుందుర్తి అవార్డు (1997), జిల్లా ఉత్తమ అధ్యాపక అవార్డు (2002), నర్రా కోటయ్య స్వర్ణపతకం (2003), రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు (2015), కాళోజీ పురస్కారం (2017), విద్యా సేవారత్న పురస్కారం (2019), జీవన సాఫల్య పురస్కారం (2019), జాషువా స్మారక కవితా పురస్కారం (2023), బెజవాడ గోపాలరెడ్డి పురస్కారం (2024), అలిశెట్టి ప్రభాకర్ స్మారక రాష్ట్ర పురస్కారం (2025) తదితర గౌరవాలు ఆయనకు దక్కాయి.

**సామాజిక చైతన్యంలో చురుకైన పాత్ర**

తెలంగాణ రచయితల వేదిక నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించారు. బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల సంఘం తెలంగాణ రాష్ట్రానికి గౌరవ సలహాదారుగా ఉన్నారు.


**యువతకు స్ఫూర్తి**

1992లో పాలెం గ్రామంలో "స్నేహ యూత్ అసోసియేషన్" స్థాపించి గ్రామీణ యువతలో క్రీడా, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించారు. GOAL సంస్థ ద్వారా పలు రాష్ట్రాల్లో విద్యా విధానాలపై ఉపన్యాసాలు నిర్వహించారు. రంగస్థల కళలపై ఆసక్తితో పలు నాటకాలకు దర్శకత్వం వహించారు.

**స్ఫూర్తిదాయక జీవనగాథ**

బోధన, సాహిత్యం, సామాజిక సేవ అనే మూడు రంగాలను సమన్వయం చేస్తూ సాగిన బెల్లి యాదయ్య జీవితం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. గ్రామ పాఠశాల నుంచి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగిన ఆయన ప్రయాణం కృషి, పట్టుదల, అంకితభావం కలిసిన విజయగాథగా నిలిచింది..

గడగోజు రవీంద్రాచారి.9848772232.



**ఐపీఎల్ మెమోరీస్**

విరాట్ కోహ్లీ అగ్రెషన్ & రన్సన్స్ వరద, ఎనర్జీతో ఐపీఎల్‌కు ఫేస్‌గా నిలిచిన స్టార్.



# గ్యాస్ కోసం జనం బారులు



**ముద్ర, గద్వాల:**

రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత వస్తుందనే అపోహతో జనం సిలిండర్లు కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల వద్ద ఖాళీ సిలిండర్లలతో బారులు తీరుతున్నారు. వంట గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం ప్రకటించినా పట్టించుకోవడం లేదు. తాజాగా అవసరం లేకున్నా భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని భావిస్తూ దబుల్ సిలిండర్ల వినియోగదారులంతా బుకింగ్ చేసుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం నిజంగా గ్యాస్అవసరం ఉన్న వారికి దొరకడం లేదు. ఇటీవల ఇరాన్ – ఇజ్రాయిల్ – అమెరికాల మధ్య ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో గ్యాస్ కొరత ఏర్పడుతుందేమోనన్న భయంతో వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్యాస్ ఏజెన్సీల వద్ద ఎల్పీజీ సిలిండర్ల కోసం వినియోగదారులు భారీగా బారులు తీరారు. రానున్న రోజుల్లో సిలిండర్లు దొరకడం కష్టమంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ కావడంతో గ్యాస్ సిలిండర్ కోసం ఉదయం నుంచే మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో ఏజెన్సీ ముందు క్యూలలో నిలబడ్డారు. దీంతో ఏజెన్సీ వద్ద మరింత రద్దీ నెలకొంది. గ్యాస్ సిలిండర్ బుక్ చేస్తే డెలివరీకి కనీసం పదిరోజుల సమయం పడుతోంది. గ్యాస్ సిలిండర్ తీసుకున్న 45 రోజుల తర్వాతనే గ్యాస్ తిరిగి బుక్ చేసుకోవాలని నిబంధనలు విధించారు. గ్యాస్ బుకింగ్ చేసినప్పటికీ, సాంకేతిక లోపాల కారణంగా డెలివరీ అథెంటికేషన్ కోడ్ (దిఎసి ) నెం బర్లు మొబైల్కు రాకపోవడంతో ఏజెన్సీ సిలిండర్లను సరఫరా చేయడం లేదంటు వినియోగదారులు ఆరోపించారు. మరోపక్క గ్యాస్ బుకింగ్ గడువు కూడా పెంచడం వినియోగదారులకు సమస్యగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు. దీనిపై జిల్లా అధికారులను వివరణ కోరగా జిల్లాలో ఎలాంటి గ్యాస్ కొరత లేదని, బుక్ చేసుకున్న వెంటనే ఏజెన్సీల ద్వారా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నట్లు తెలిపారు.

## కొలువుదీరిన కొత్త మున్సిపల్ చైర్‌పర్సన్



**ముద్ర, నారాయణపేట:**

నారాయణపేట మున్సిపల్ చైర్పర్సన్ గా కొండా శ్వేతా సత్యా యాదవ్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గా అధికారికంగా బాధ్యతలు చేపట్టిన పార్టీపరంగా పెద్ద ఎత్తున ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించి సుమారు నెలరోజుల పాటు కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. రాష్ట్రంలోనే ఏకైక మున్సిపాలిటీ నారాయణపేటలో బిజెపి సొంతం కావడంతో అట్టహాసంగా రాష్ట్ర పార్టీ నాయకులు, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖుల సమక్షంలో కార్యక్రమా న్ని ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించాలని చాలా రోజుల నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏది ఏమైనాప్పటికీ గురువారం జరిగిన చైర్పర్సన్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ముందుగా పూజా కార్యక్రమాలు, యజ్ఞం నిర్వహించి చైర్పర్సన్ బాధ్యతలు చేపట్టగా పలువురు ఘనంగా సన్మానించారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



**ముద్ర, గద్వాల:**

కొండాపురం గ్రామంలో పులుసు తిమ్మారెడ్డి అనే లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు బుధవారం అంగరంగ వైభవంగా చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలను ఇంటి యజమానులను చేసే కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని దానిని అంకితభావంతో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి, మండలాధ్యక్షులు ఉరుకుందు, కేటిదొడ్డి సర్పంచ్ నారాయణ, నాయకులు తిమ్మారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వద్దే హనుమంత రెడ్డి డిమాండ్ చేశారు. అచ్చంపేట మండలంలోని నడింపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అర్జునయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండో పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలని, పర్యవేక్షక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎస్. మురళి, కార్యదర్శి శ్రీధర్రావు, మండల అధ్యక్షుడు నారాయణ గౌడ్ పాల్భొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు కలిసికట్టుగా కృషి

**మత్తు పదార్థాలు సరఫరా అవుతున్నట్లు సమాచారం ఇస్తే రూ.10 వేల బహుమతి**

**ముద్ర, జోగుళాంబ గద్వాల ప్రతినిధి:**



జిల్లాలో మత్తుపదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు సంబంధించి శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మత్తు పదార్థాల నివారణ పై నిర్వహించే నార్కోటిక్స్ మీటింగ్ లో మాట్లాడారు. విద్యా సంస్థలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్స్, అంగన్వాడీ కేంద్రాల్లో, మహిళా సంఘాల సమావేశాల్లో కూడా డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కలిగేలా వివరించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సరఫరా అవుతున్నట్లు సమాచారం ఇచ్చే పౌరులకు రూ.10 వేల నగదు బహుమతి ఇస్తామని ప్రకటించా లన్నారు. ఎవరైనా, ఎక్కడైనా గంజాయి మొక్కలు పెంచుతుంటే అటవీ శాఖ అధికారులు నిఘా ఉంచి నిర్మూలించాలన్నారు. సమావేశంలో డీఈవో విజయలక్ష్మి , డీడబ్ల్యువో సునంద, ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, ఎక్సైజ్ అధికారి సైదిరెడ్డి, డ్రగ్ ఇన్స్పెక్టర్ వినేయ్ కుమార్, అటవీ, రెవెన్యూ, వైద్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం అందేలా చర్యలు

**నెలవారి నేర సమీక్షలో ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

జిల్లాలో నమోదయ్యే ప్రతి కేసులో ఎఫ్ ఐఆర్ నుంచి చార్జిషీట్ వరకు అన్ని ప్రక్రియలు పారదర్శకంగా ఉండాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అన్నారు. బుధవారం నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన సైబర్ మోసాలు, మహిళా భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. అలాగే "అరైవ్–అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించాలని ఆదేశించారు.పెండింగ్ కేసులు లేకుండా వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని, పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో:అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీలు సాయి వెంకట్ రెడ్డి, బుర్రి శ్రీనివాస్, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన డిసెంబర్ త్రైమాసిక లక్ష్యాల సాధనపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన రైతులందరికీ పంట రుణాలు విస్తృతంగా అందించాలని, ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉన్న నేపథ్యంలో బ్యాంకులు ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలులో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రత్యేకించి వ్యవసాయ రుణాలు, చిన్న, మధ్య తరహా వ్యాపార వేత్తలకు ఇచ్చే రుణాలు, టర్మ్ లోన్లు, అలాగే వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాల గ్రౌండింగ్ విషయంలో బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఈ లక్ష్యాలను ఈ నెల 30లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం 2026–27 సంవత్సరానికి సంబంధించిన నాబార్డ్ పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, ఆర్బీఐ మేనేజర్ శ్రీనివాస్, నాబార్డ్ ప్రతినిధి మనోహర్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆశీస్ రంజన్, ఎస్బీఐ రాకేష్, టీజీబీ మేనేజర్ దేవుల్ల, పీడీ డీఆర్డీఏ చిన్న ఓబులేసు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గోపాల్ నాయక్, వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ అధికారి ఫిరంగి పాల్గొన్నారు.

## అభివృద్ధి చేస్తే.. ఆగం చేశారు

**-మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



పాలమూరు పట్టణం లో బీ ఆర్ ఎస్ అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ అధికారం లోని వచ్చి ఆగం చేస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం తమ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు చేసిన ప్రాంతాలను ఆయన సందర్శించారు. తమ హయాంలో చేసిన ఏర్పాట్లు తప్ప రెండున్నర ఏండ్లలో కాంగ్రెస్ సర్కార్ వసతులు కల్పించలేదని విమర్శించారు. రేపటిలో గా పేదలు ఆత్మగౌరవం గా భోజనం చేసేందుకు వసతులు కల్పించకుంటే, తానే స్వయంగా అవసరమైన వసతులు కల్పిస్తానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలి కానీ రాజకీయం చేసి తనపై కక్ష తో పాలమూరును ఆగం చేయొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సమర్థవంతంగా ప్రగతి ప్రణాళిక

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్సు హాలు లో అదనపు కలెక్టర్ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరిలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుండి వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. గ్రామ సభ మండల, నియోజకవర్గ పరిదిలో సభలు ఏర్పాటు చేసే విధంగా ప్రణాలికలు సిద్ధం చేయాలనీ ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయం, సన్న బియ్యం బోనస్, రైతు భరోసా, రైతు భీమా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాలు ఇప్పటి వరకు ఎంత మంది లబ్ది దారులకు అందజేశారు. ఇంకా ఎంత మందికి ఇవ్వ వలసి ఉంది, ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు ఇప్పటి వరకు చేసిన వాటి పూర్తి సమాచారంతో లిస్టు సబ్మిట్ చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ డి ఓ వాసు చంద్ర, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, సిపి ఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### రూ. 5 భోజనానికి ఆటంకం ఉండదు

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

పాలమూరు పట్టణం లో రూ. 5 కే భోజనం అందిస్తున్న నిర్వాహకులకు ఆటంకం ఉండదని, తన సొంత నిధులతో అన్నీ సౌకర్యాలు కలిపిస్తామని మున్సిపల్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం బస్ స్టాండ్ వద్ద ఉన్న భోజన శాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. నీడ కోసం వెంటనే కొత్త టెంట్ తో పాటు తాత్కాలిక షెడ్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రఘు, నాయకులు మైత్రి యాదయ్య, రామకృష్ణ పాల్గొన్నారు

### కమ్యూనిటీ హాల్ కు శంకు స్థాపన

బండమీదిపల్లి లో యాదవ సంగం కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేశారు. అనంతరం చిట్టెమ్మ, సాంబయ్య ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. అనంతరం రాజీవ్ గృహ కల్పలో 25 కేవీ ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గిరి గౌడ్,ముజీబ్, రఘు,యాదవ్ సంగం అధ్యక్షుడు జంగయ్య యాదవ్, జగదీష్, బుచ్చయ్య, శ్రీను, యాదయ్య, తిరుపతయ్య గౌడ్, కాశీమ్, వడ్డే సంజీవ, జకీర్, ప్రభాకర్, అబిద్, తదితరులు పాల్గొన్నారు.

### హజ్ యాత్రికుల టీకా శిబిరం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆసుపత్రిలో బుధవారం హజ్ యాత్రకు వెళ్తున్న 9మంది యాత్రికుల కోసం వైద్య పరీక్షలు, టీకా శిబిరం విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ తెలిపారు. శిబిరం జిల్లా జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సురేష్ బాబు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్ నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ ఓరుగంటి శ్రీనివాసులు, డాక్టర్ సూర్యనారాయణ, ఆర్ఎంఓ డాక్టర్ అజీమ్ తదితరుల పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా హజ్ సొసైటీ కార్యదర్శి అల్హాజ్ మహమ్మద్ ఇబ్రహీం, ఉపాధ్యక్షులు షంషీర్ ఖాన్, యూసుఫ్ గిలిమి, అబ్దుల్ హక్, ప్రచార కార్యదర్శి షేక్ నూరుల్ హక్, సభ్యులు సయ్యద్, ఎజాజ్ నక్షబంది వల్ ఖాద్రి పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదుపై స్పందన

**ముద్ర, కూకట్‌పల్లి :**

ఎల్లమ్మబండ భారతి విద్యాలయ పాఠశాల సమీపంలోని కమ్యూనిటీ హాల్‌ను ఆక్రమించి రాజకీయ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని 'టీమ్ సభ్యులు' ఆల్విన్ కాలనీ సర్కిల్ డీసీ చాముండేశ్వరి కి ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన డీసీ సంబంధిత అధికారులను ఆదేశించి రాజకీయ ఫ్లెక్సీలను తొలగించారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే ఈ హాల్‌ను ఎల్లమ్మబండలోని అన్ని కాలనీల ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని డీసీ హామీ ఇచ్చారు. ఆసుపత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన మట్టిని కూడా తొలగించారు.

## 28న జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

ఈ నెల 28న నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ శ్రీ డి. రమాకాంత్ తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై మాట్లాడారు. లోక్ అదాలత్ లో భూవివాద కేసులు, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, మోటారు వాహన ప్రమాద కేసులు, బ్యాంకు కేసులు తదితర పెండింగ్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. "రాజీ మార్గమే రాజమార్గం" అని పేర్కొంటూ, లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన కేసులు పరిష్కారం కావడంతో పాటు అప్పీల్ లేని తీర్పు లభిస్తుందని, దీని ద్వారా సమయం, ఖర్చు ఆదా అవుతాయన్నారు. ఇరువర్గాలు రాజీ చేసుకోవడం ద్వారా సుఖసంతోషాలతో జీవించవచ్చని సూచించారు.ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ పోస్టర్ ను జిల్లా జడ్జి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి నసీం సుల్తానా మాట్లాడుతూ కక్షిదారులు పగలు, ప్రతీకారాలు పెంచుకోకుండా రాజీ మార్గాన్ని అనుసరించడం వల్ల మానవ సంబంధాలు బలపడతాయని అన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరగా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

## ఆర్టీసీ డిపోలో బీసీ సంక్షేమ సంఘం

**ముద్ర, తాండూర్ :**

వికారాబాద్ జిల్లా తాండూర్ ఆర్టీసీ డిపోలో బుధవారం తాండూర్ డిపో ఆర్టీసీ కార్మికులు బీసీ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు.ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్య అతిథిగా ప్రధాన కార్యదర్శి నిరంజన్ హాజరైనారు.గౌరవ అధ్యక్షులుగా తాండూర్ మాజీ మార్కెట్ చైర్మన్ పట్లోళ్ళ బాల్ రెడ్డి ని నియమించుకున్నారు. అధ్యక్షులుగా శ్రీనివాస్, కార్యదర్శిగా శ్రీనివాస్, వర్కింగ్ ప్రసిడెంట్గా అశోక్, వైస్ ప్రసిడెంట్లుగా శోభ, లక్ష్మిప్రియ, కోశాధికారిగా విజయ్ కుమార్, మాణిక్యప్ప, చైర్మన్ గా అంజిలయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రకాంత్, వీరప్ప నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గుణాత్మక విద్యను అందించడమే లక్ష్యం




**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ప్రపంచంతో పోటీపడేలా విద్యార్థులకు గుణాత్మకమైన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని శ్రీ సాయి విద్యానికేతన్ డైరెక్టర్ బసవరాజు గౌడ్ తెలిపారు. పాఠశాల 3వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, గేయాలు, నాటికలు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. ప్రిన్సిపాల్ రవళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గురుకులంకు 8 మంది ఎంపిక

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు గురుకులంకు ఎంపికయ్యా రు. వీరిలో పాత్కుల రిషిత్ కుమార్, పాత్కుల కౌశిక్, నడిగడ్డ విగ్నేష్, ఆలూరి చంటి, పొట్టల శ్రీనిధి, మధనాగుల అలేఖ్య, గోరటి మాధవి, ఆలూరి హర్షికలను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎంఈవో చంద్రశేఖర్, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేష్, ఆంజనేయు లు, చందన, సంగీత అభినందించారు.

## స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:**

జిల్లా తాడూర్ మండలం సిరసవాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్సులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ అభినందించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 26.03.2026
www.mudranews.in | @mudranews



**ఐపీఎల్ మెమోరీస్**

**సూపర్ ఓవర్ థ్రిల్లర్స్**



టై మ్యాచ్‌లు, సూపర్ ఓవర్లు అభిమానులకు ఫుల్ రష్ ఇచ్చిన క్షణాలు.

# మున్సిపల్ కార్మికుల ప్రాణాలతో చెలగాటమా !

**- విధి నిర్వహణలో ప్రమాదం... లైన్ మెన్‌కు తీవ్ర గాయాలు**

**- ఇన్సూరెన్స్, భద్రత పరికరాలు లేక తీవ్ర ఇబ్బందులు**

**- మున్సిపల్ కార్మికుల కోసం ప్రత్యేక ప్రమాద ఆర్థిక నిధి ప్రకటించాలి**

**- కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్**




**ముద్ర, కరీంనగర్:** మున్సిపల్ కార్మికుల భద్రతపై మళ్లీ ప్రశ్నలు లేవనెత్తే ఘటన కరీంనగర్‌లో చోటుచేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా లైన్ మెన్ శివకృష్ణ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బొమ్మకల్‌కు చెందిన శివకృష్ణ అల్గునూరు ప్రాంతంలో పనిచేస్తున్న సమయంలో జరిగింది. ప్రమాదం గురించి తెలుసుకున్న వెంటనే కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ మేయర్ కొలగని శ్రీనివాస్‌తో కలిసి సురక్ష ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. శివకృష్ణ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అతనికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు రోజూ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారన్నారు. కానీ వారికి అవసరమైన రక్షణ పరికరాలు, భద్రతా ప్రమాణాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది లైన్ మెన్‌లు ఇన్సూరెన్స్ సదుపాయం లేకుండా పనిచేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. "మున్సిపల్ కార్మికుల ప్రాణాలకు విలువ లేదా? కనీస భద్రతా పరికరాలు కూడా అందించకుండా విధుల్లో పెట్టడం బాధ్యతారాహిత్యం" అని ఆయన విమర్శించారు. మున్సిపల్ కార్మికులందరికీ నాణ్యమైన భద్రతా పరికరాలు, సేఫ్టీ కిట్లు, గ్లవ్స్, హెల్మెట్లు తక్షణమే అందించాలని కోరారు. ప్రతి కార్మికుడికి సమగ్ర ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన కార్మికులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు ప్రత్యేక ప్రమాద నిధిని ఏర్పాటు చేయాలన్నారు. పేద కుటుంబాలకు చెందిన కార్మికులు ప్రమాదాలకు గురైతే వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. గాయపడిన శివకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, బాధిత కుటుంబానికి అవసరమైన సాయం అందిస్తానని సర్దార్ రవీందర్ సింగ్ హామీ ఇచ్చారు.

## భూ సమస్యలు పరిష్కరించాలి



**మహాదేవపూర్, ముద్ర:** దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ వివాదాలకు సంబంధించిన అన్ని రికార్డులు, పొజిషన్ ను సక్రమంగా పరిశీలించి నివేదికలను అందచేయాలని సూచించారు. రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన భూ వివాదాల విషయంలో సంయుక్త సర్వేలు నిర్వహించడం ద్వారా హద్దులను నిర్ణయించాలని స్పష్టం చేశారు. భూ సరిహద్దుల విషయంలో తలెత్తుతున్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు పనిచేయాలని సూచించారు. భూ సమస్యల పరిష్కార ప్రక్రియలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, భూపాలపల్లి, ఘన్పూర్, గోరి కొత్తపల్లి, రేగొండ, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ల పల్లి మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## భూమి కోల్పోతున్న రైతులతో సమావేశం



**మహాదేవపూర్, ముద్ర:** స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా భూమి కోల్పోతున్న రైతులతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు కాలువల వల్ల నష్టం జరుగుతుందని అధికారులతో వాదించారు. ఇప్పటికే ప్రతి రెండు ఎకరాలకు బోరు బావి ఉందని, రేపు ద్వారా తాము వ్యవసాయం చేస్తున్నామన్నారు. కెనాల్ నీళ్ల వలన పంటలకు నష్టం వాటిల్లుతుందని వాదించారు. సుముఖంగా ఉన్న రైతులు ముందుకు రావాలని సహసీల్దార్ ప్రహ్లాద్ కోరగా తాము సుముఖంగా లేమని రైతులు దిగేసి చెప్పటంతో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్, తహసీల్దార్, , ఎంపీడీవో, జీపీఓ, నీటిపారుదల శాఖ ఏఈ, రైతులు పాల్గొన్నారు.

## భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** శ్రీ రామ నవమి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలు ప్రశాంతంగా జరిగేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ జానకి షర్మిల ఆదేశించారు. సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక పహారా – డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేయాలన్నారు. ఎస్పీ జానకి షర్మిల బుధవారం ఏఎస్పీ సాయి కిరణ్ తో కలిసి జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీరామ నవమి శోభాయాత్రల ఏర్పాట్లపై చర్చించారు. ప్రత్యేక పహారా ఏర్పాటు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ, చేయాలన్నారు.

# విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**మహాదేవపూర్, ముద్ర:** హాస్టళ్లలోని విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం కాటారం మండలం మేడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, భోజన శాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక వసతులు, పరిశుభ్రత, ఆహార నాణ్యత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల వసతి గృహం నిర్వహణ, సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల పరిస్థితి తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపు, బోధన నాణ్యత మెరుగుదల, వసతి గృహాల్లో శుభ్రత పాటించడం, పోషకాహారం సమయానికి అందించడం వంటి విషయాల్లో సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఏర్పడే చిన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాబు, నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన కొరత లేదు



**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లాలో ఇంధన కొరత లేదని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సంబంధిత శాఖల అధికారులు, పెట్రోల్ బంక్ డీలర్లతో నిర్వహించిన జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇంధన కొరత తలెత్తకుండా నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులు అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకునే పరిస్థితి రాకుండా అవగాహన కల్పించడంతో పాటు, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌర సరఫ రాల శాఖ అధికారులను ఆదేశించారు. చమురు సంస్థల ప్రతినిధులతో సమన్వయం కొనసాగిస్తూ జిల్లాకు అవసరమైన ఇంధన కోటాను సకాలంలో తెప్పించుకోవాలని డీలర్లకు సూచించారు. జిల్లాలో ఎక్కడా 'స్టాక్ లేదు' అనే బోర్డులు కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సేవల వాహనాలకు ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఎలాంటి సమస్యలు లేదా సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1939ను సంప్రదించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నందిని, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, చమురు సంస్థల ప్రతినిధులు, పెట్రోల్ బంక్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# విధి లేని పరిస్థితిలో వీడుతున్నా..

**- కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా**

**- జీవన్ వెంటే ఉంటామని నినదించిన అభిమానులు, కార్యకర్తలు**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** విధిలేని పరిస్థితుల్లోనే తాను కాంగ్రెస్ ను వీడుతున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. జగిత్యాల పట్టణంలోని బండారు గార్డెన్ లో అభిమానులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రాజీనామా పత్రం విడుదల చేశారు. కాంగ్రెస్ కండువా తీసేసి, ఆకు పచ్చ కండువా మెడలో కప్పుకున్నారు. ఈ సందర్భంగా తాము జీవన్ రెడ్డి వెంటే ఉంటామని అభిమానులు, కార్యకర్తలు ముక్తకంఠంతో నినదించారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ 20 నెలలుగా మానసిక శోభ అనుభవిస్తున్నానని, ఇంకా ఎంతకాలం ఈ అవమానాలు.. ఈ మానసిక క్షోభ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల అనుబంధం వదులుకోవలని ఎవరు కోరుకోరని, విధి లేని పరిస్థితి లో నిర్ణయం తీసుకున్ననన్నారు. తాను ఈ స్థాయికి రావడానికి మిత్రులు, అభిమానులు, నాయకులు కార్యకర్తలు తోడ్పడ్డారన్నారు. 1984 లో కాంగ్రెసు పార్టీ చేరానని, ఎన్నికల్లో గెలవడం, ఓడటం సహజమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితిలో సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం కాంగ్రెస్ పార్టీ ఐక్యత కు నిదర్శనమన్నారు. 1996 శాసన సభ ఉప ఎన్నికల్లో 54 వేల మెజార్టీ తో గెలుపొందిననన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కేసీఆర్ పై 2006, 2008 పార్లిమెంట్ ఉప ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశాల మేరకు పోటీ చేశానని, 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో టీఆర్ ఎస్ గెలుపొందితే ఉత్తర తెలంగాణ జలాల్లో ఏకైక శాసన సభ్యుడిగా ఎన్నికై ప్రజల పక్షాన ప్రజల గొంతుకగా వినిపించానని గుర్తు చేశారు. 2018 లో ఎమ్మెల్యేగా ఓడినా, 2019 ఉమ్మడి నాలుగు జిల్లాల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో ప్రశ్నించే గొంతుకగా ఎమ్మెల్సీగా గెలుపొందినన్నారు.

### ఎమ్మెల్యే సంజయ్ పై ఆగ్రహం...

ఒకవైపు స్పీకర్ పరిధి లో బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే ఫిరాయింపు విచారణలో ఉండగా, గాంధీ భవన్ లో స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహ రచన సమావేశంలో ఎమ్మెల్యే సమావేశం కావడం దేనికి సంకేతం అని అన్నారు. బీ ఆర్ ఎస్ పాలనలో అరచకం చేసిన పోలీస్ యంత్రాంగం మళ్ళీ తీసుకు వచ్చారన్నారు. ఆయనకు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కూడా జతగా మారిందన్నారు.

### జీవన్ రెడ్డిను అణగదొక్కాలనే..

జీవన్ ఎదగకుండా అణగ దొక్కాలని రేవంత్ రెడ్డి ఆలోచనని దుయ్య బట్టారు. శాసన మండలి లో ఒంటరి పోరాటం చేసిన తాను మంత్రి పదవికి అర్హుడిని కాదా అన్నారు. సోనియా గాంధీ నిర్ణయం తీసుకుని పీసీసీ అధ్యక్షుడిగా నన్ను నిర్ణయించుకున్న తర్వాత మారు తుందా అని ప్రశ్నించారు. అనంతరం వివి ధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

## బాసర ట్రిపుల్ ఐటీ డీఎస్పీగా సాయికిరణ్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ డీఎస్పీగా భైంసా ఎస్డీపీఓ సాయికిరణ్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ ఆదేశాల మేరకు పి. సాయి కిరణ్ బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ డీఎస్పీగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, విద్యార్థులు, సిబ్బందికి భద్రత కల్పించడం, అలాగే యూనివర్సిటీ పరిపాలనతో సమన్వయం చేసుకుంటూ విధులను సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## గురుకుల పాఠశాలకు ఎంపిక

**ముద్ర, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం పరిధి రాజాపూర్ మండల పరిషత్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. నాలుగో తరగతి చదువుతున్న ప్రణతి, మనోజ్, రక్షిత, రామ్ చరణ్ గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించి సీట్లు పొందారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని మమత విద్యార్థులను అభినందించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 26-03-2026
www.mudranews.in | @mudranews



### ఐపీఎల్ మెమోరీస్
**2020 డబుల్ సూపర్ ఓవర్ డ్రామా**

మ్యాచ్‌లో రెండు సూపర్ ఓవర్లు – ఐపీఎల్ హిస్టరీలో అరుదైన ఘట్టం.




# పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి

**- తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా**




ముద్ర, తుంగతుర్తి:

పెన్షనర్లకు తీవ్ర నష్టాన్ని కలిగించే పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం–2025ను కేంద్రం తక్షణమే రద్దు చేయాలని బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ ఈ పెన్షన్ విధానంతో తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. జనవరి ఒకటి 2026 కంటే ముందు ఉద్యోగ విరమణ పొందిన వారిని, ఆ తర్వాత విరమణ పొందిన పెన్షనర్లను వేర్వేరుగా విభజించి వేతన సవరణ సంఘం సిఫారసుల ప్రయోజనాలు ఉంటాయని చెప్పడం అనుమానాలకు దారితీస్తుందన్నారు. కేంద్రం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పెండింగ్ డిఏల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు.

ధర్నాకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతయ్య, రమేష్ గౌడ్ సంఘీ భావం తెలిపారు. అనంతరం తహశీల్దార్ దయానందంకు వినతిపత్రం అందించారు.

# అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

**– జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




ముద్ర, సూర్యాపేట:

జిల్లాలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో వెబెక్స్ ద్వారా జిల్లా ఎస్పీ కే నరసింహతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 6 ఇసుక రీచ్ లలో అక్రమ ఇసుక రవాణా వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించుటకు ఆన్లైన్లో నమోదు చేపించాలని, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి పోలీస్, రెవిన్యూ, మైనింగ్ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేయాలని, ఈ టీం జిల్లాలోని ఇసుక రిచ్ లో పర్యటిస్తూ అక్రమ ఇసుక రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 729 ఆమోదం పొందిన ఇసుక ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించాలని, ప్రతి సాండ్ టాక్సీ రీచ్‌లో 24 గంటల పర్యవేక్షణ కోసం హై–ఎండ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్‌లను తప్పనిసరిగా సందర్శించాలని, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్, 1 నుండి ఇసుక సరఫరాకు మ్యాన్యువల్ ఉండదని ఆన్ లైన్ ట్రాన్సిస్ట్ పాస్ స్టమ్(ఓటిపిఎస్), మన ఇసుక వాహనం ద్వారా ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని, గ్రామపంచాయతీ సెక్రటరీ ఇసుక ఎంత కావాలో నిర్ధారిస్తే, సంబంధిత తహసిల్దార్ పర్యవేక్షణలో ఆన్లైన్ ద్వారా నమోదు చేస్తారని కలెక్టర్ వెల్లడించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, రెవెన్యూ డివిజనల్ అధికారి వేణు మాధవరావు, మైనింగ్ ఏడి విజయ రామారావు, డిపిఓ యాదగిరి, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి బాలు, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బస్సులను ఆర్టీసీకి అప్పగించాలి

**- సిఐటియు జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి :



కేంద్ర ప్రభుత్వం కాలుష్య నియంత్రణ పేరుతో ఆర్టీసీలో ఏర్పాటు చేసిన విద్యుత్తు బస్సులను ఆర్టీసీకే అప్పగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం యాదగిరిగుట్ట బస్సు డిపో దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2019 ఎంవీ యాక్ట్ తీసుకొచ్చి డ్రైవర్లను బాధ్యులుగా చేస్తూ ఎక్కువ పెనాల్టీలు వేస్తూ మానసిక వేదనకు గురి చేస్తుండన్నారు. ఆర్టీసీని, ఆస్తులను కాజేయాలనే కుట్రతో విద్యుత్ బస్సులను ప్రైవేటు వారి ఆధీనంలోకి తీసుకురావాలని చూస్తుందన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని అన్నారు. సంస్థలో గత ప్రభుత్వం యూనియన్ల పై పెట్టిన ఆంక్షలను ఈ ప్రభుత్వం కూడా కొనసాగించడం ప్రజాపాలన ఎట్లా అవుతుందో చెప్పాలని అన్నారు. 2017 ఏరియర్స్ బకాయిలు, 2021, 2025 పే స్కేల్ అమలు చేయకుండా కార్మికులతో వెట్టి చేయిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో కాలుష్య నియంత్రణ కోసం విద్యుత్ బస్సులు వినియోగించి పాత డీజిల్ బస్సులను జిల్లాలకు పంపించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్ నరసయ్య, యాదప్ప, నూకల భాస్కర్ రెడ్డి, సీస శ్రీనివాస్, ఎస్కే షరీఫ్, ఈశ్వర్ రెడ్డి, జానయ్య, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## రుణాల పంపిణీలో అక్రమాలపై విచారణ చేపట్టాలి

**- కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డికి బీఆర్ఎస్ వినతి పత్రం**

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

భువనగిరి పట్టణంలోని మహిళా స్వయం సహాయక సంఘాల రుణాల పంపిణీలో భారీ అక్రమాలు జరిగినట్లు ఆరోపిస్తూ బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెప్మా అధికారులు, రిసోర్స్ పర్సన్లు, బ్యాంకు ఉద్యోగులు కుమ్మక్కై, రుణాలను పక్కదారి పట్టించారని ఆరోపించారు. పట్టణంలోని 48 మంది రిసోర్స్ పర్సన్లపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యుల ఆస్తులను జప్తు చేసి ఆ నగదును తిరిగి బాధితుల ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు నాగిటీ నగేష్, ఏలే భువనేశ్వరి శివకుమార్, చెన్న స్వాతిమహేష్, చీమల రాజు, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

భువనగిరి మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం కొలువుదీరి 45 రోజులు గడుస్తున్నా, ఇప్పటి వరకు ఒక్క కౌన్సిల్ సమావేశం కూడా ఏర్పాటు చేయక పోవడంపై పలువురు వార్డు సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవో అంజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గత ఫిబ్రవరి 16వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ ఏర్పాటైనప్పటికీ, ఇంతవరకు సమావేశం జరగకపోవడంతో వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలు చర్చకు రావడం లేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కౌన్సిలర్లను నిలదీస్తున్నారని, అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము సమాధానం చెప్పలేక పోతున్నామని వారు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్లు ఏలే భువనేశ్వరి శివ కుమార్, చెన్న స్వాతి మహేష్, చీమల రాజు, నాకోటి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

## బాలసదన్ లో వసతులు కల్పించాలి

**- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

బాలసదన్ బాలికలకు మంచి వసతులు కల్పించి ఆశ్రమ నిర్వహణ చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు బుధవారం ఆమె భువనగిరిలోని బాలసదన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. బాలసదన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల తనిఖీ

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భువనగిరి మండలం పట్టణ శివారులో ఉన్న తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.మనోహర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వంటగదిని, స్టోర్ రూమ్ ను భోజనశాలను, విద్యార్థులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటేపై భయపడవద్దని, టెలి మానస్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తమ వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ యాకయ్య ,వార్డెన్ మాజాయిద్దీన్, పల్లె దవాఖాన వైద్యుడు డాక్టర్ మురళీమోహన్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ ఏప్రిల్‌లో ప్రారంభం

**- ఆర్డీవో కృష్ణారెడ్డి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఏప్రిల్‌లో ప్రారంభించనున్నట్లు ఆర్డీవో కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వేకు సంబంధించిన ఫారాలను అవసరమైన కిట్లను అందజేస్తామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫారాలను అందజేసి, వారే స్వయంగా నింపి అవసరమైన పత్రాలను జత చేసి ఇచ్చే విధంగా సూచించాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలు, సందేహాలు, కొత్త మార్గదర్శకాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ సిహెచ్ జగన్ ప్రసాద్, నాయిబ్ తహసిల్దార్లు, ఆర్ఐలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాల తనిఖీ

ముద్ర, మోత్కూర్:

మోత్కూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం తహసిల్దార్ పి.జ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఓ యాదమ్మ, సిఆర్ టి గణిత ఉపాధ్యాయురాలు లక్ష్మీభాయి ఉన్నారు.

# పోచంపల్లి చేనేత అభివృద్ధికి అనేక అవకాశాలు

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి :



పోచంపల్లి చేనేతకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న నేపథ్యంలో, ఈ ప్రాంతాన్ని చేనేత వస్త్ర వ్యాపారం, టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడానికి అనేక అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం పోచంపల్లి మండల కేంద్రంలో టూరిజం పార్క్, చేనేత వృత్తిదారుల ఇండ్లను నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మానేజ్మెంట్ టీంతో కలసి పరిశీలించారు. పోచంపల్లి చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను హెచ్ఎండిఏ అధికారులతో సమీక్షించి అక్కడ జరిగే పనులను త్వరత్వరతిన పూర్తి చేయాలని టూరిజం పరంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. పోచంపల్లి చేనేత సహకార సంఘం సందర్శించి ఇక్కత్ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులతో మాట్లాడి చేనేత కార్మికుల సంక్షేమం, వారి స్థితిగతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో కలిసి ప్రాంతంలోని ప్రస్తుత పరిస్థితులను సమీక్షిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలపై కీలక సూచనలు చేశారు. టూరిజం, చేనేత రంగాల అభివృద్ధి ఒకదానికొకటి అనుసంధానమై ఉండేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. మార్కెటింగ్ సదుపాయాలను విస్తరించాలని సూచించారు. పోచంపల్లిని టూరిజం, చేనేత కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని కలెక్టర్ పేర్కొ న్నారు.

అనంతరం పోచంపల్లి మండలంలోని జాలాల్పూర్లో ఉన్న స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థలో విద్యార్థులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా చేనేత శాఖ ఏ.డి ఎ.శ్రీనివాస రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, తాసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో భాస్కర్,జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**- ఎస్పీ కె.నరసింహ**

ముద్ర, సూర్యాపేట:

ఈ నెల 28న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ నరసింహ సూచించారు. 28న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా క్షేత్ర స్థాయి పోలీసు అధికారులతో ఎస్పీ నరసింహ తన కార్యాలయం నుండి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, ఇరువైపుల సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని, న్యాయ శాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.




# బీఆర్ఎస్ లో వంద మంది చేరిక



ముద్ర ప్రతినిధి, భువనగిరి :


యాదగిరిగుట్ట పట్టణంలోని 2 వ వార్డుకు చెందిన సీనియర్ నాయకుడు మోతే నరసింహ నాయకత్వంలో సుమారు వంద మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. మోతే నరసింహ, మోతే విజయ్, శ్రీరాములు, తూర్పాటి బాల నరసింహ, తూర్పాటి శంకర్ శంకర్, మిర్యాల నాగార్జున, కళ్యాణ్, దావీద్, సల్ల ప్రవీణ్ మోతే స్వామి, కళ్లెం మల్లేష్ పరశురాంతో కలిసి సుమారు 100 మంది చేరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ముక్కెర్ల సతీష్ యాదవ్, నాయకులు బాలయ్య గౌడ్, రాజేష్ యాదవ్, నర్సింగం పురుషోత్తం, మోతే బాలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

**- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేస్ చిస్తి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి :



అన్ని వర్గాలకు సముచిత న్యాయం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేస్ ఉర్ రెహమాన్ చిస్తి అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో ఇటీవల జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గానికి ఎన్నికైన వారికి, నూతన కౌన్సిలర్ గా ఎన్నికైన దళిత మైనార్టీ వర్గాల ప్రతినిధులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో దళిత మైనార్టీ వర్గాలకు చెందిన ప్రతినిధులకు సముచిత స్థానం ఇవ్వడం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా ఎంపికైన చుక్క స్వామి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ఎండి మజార్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ఎండి అబేద్ ను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో బట్టు రాంచంద్రయ్య, బాబు రావు, హరిప్రసాద్, మజహర్, ఆబెద్, చుక్క స్వామి, షఫీక్ అహ్మద్, బబ్లు, జహంగీర్, అక్తర్ బుర్హాన్, విగ్నేష్, బొంత నర్సింహా, ఈరపాక నర్సింహా, కొల్లూరి రాజు, పడిగేలా ప్రదీప్, షరీఫ్, ఇబ్రహీం, ముత్తు, రాషెద్, శంకర్, యాదగిరి, అశోక్, అతహర్, గోపి, ప్రకాష్ పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని 22, 23వ వార్డుల కౌన్సిలర్లు బర్రె పూజిత జహంగీర్, జాలిగం విఘ్నేష్ మున్సిపల్ కమిషనర్ రామలింగంను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణంలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని బోర్లను ఫ్లషింగ్ చేపించి మోటార్లు బిగించాలని, మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి వీధి దీపాలను, అత్యవసర అవసరాలకు ఉండే వాటిని ఎజెండాలో పెట్టాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో బర్రె నరేందర్, ఐలాపురం బాబు, కరకాల రమేష్, క్రాంతి, బాబు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**శ్రీశాంత్ – హర్భజన్ సింగ్ స్లాప్ గేట్**
ఫీల్డ్ బయట కూడా ఐపీఎల్‌లో సంచలనానికి నాంది.

## పెట్రోల్ డీజిల్ కొరతతో ప్రజల అవస్థలు



- **సరఫరా చేయడంలో ప్రభుత్వం అధికార యంత్రాంగం విఫలం**
- **నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుంటే కొరత లేదనడం విడ్డూరం**
- **సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జాలిగపు శిరీష**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లా కేంద్రంలో పెట్రోల్ డీజిల్ కొరతతో వాహనదారులు ప్రజలు అవస్థలు పడుతున్నారని దీనికి భిన్నంగా ఎక్కడ కూడా పెట్రోల్ కొరత లేదంటూ చెప్పడం విడ్డూరం అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జాలిగపు శిరీష విమర్శించారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆర్టీసీ పెట్రోల్ బంకు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ కొరత ఏర్పడి పెట్రోలు డీజిల్ స్టాక్ లో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసినప్పటికీ అందుకు తగినట్లు పెట్రోల్ డీజిల్ ధరలను సప్లై చేయకపోవడం అందుకు అవసరమైన చర్యలు తీసుకోకపోవడమే ఈరోజు పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడి నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయని అన్నారు. కానీ అధికారులు ప్రభుత్వం ఎక్కడ కూడా పెట్రోల్ డీజిల్ కొరత లేదని ఎవరు ఆందోళన చెంద వద్దని చెప్పడం చూస్తుంటే తమ తప్పులు కప్పిపుచ్చుకోవడం తప్ప మరొకటి కాదని అన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని పెట్రోల్ ను ప్రజలకు సరఫరా చేయాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు మామిడాల కనకయ్య, కొండం సంజు, బత్తుల అభిషేక్ బాన్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

- **సిద్దిపేట జిల్లా జడ్జి సాయి రమా దేవి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**



ఈ నెల 28 న సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా జడ్జి సాయి రమా దేవి సూచించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ రాజి కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న కేసులు రాజి కుదుర్చుకోవాలన్నారు. దాని వల్ల సమయం, డబ్బు అదా అవుతాయని తెలిపారు. కుటుంబ తగాదాలు, ఫైనాన్సియల్ డిస్ప్యూట్స్, సివిల్ తగాదాలు, ఆక్సిడెంట్ కేసులను రాజి కుదుర్చుకోవడానికి వీలుంటుందన్నారు. గురువారం నుండే కాక్షిదారులు కోర్టులో కేసులు రాజి చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. సిద్దిపేట జిల్లా లో మొత్తం 2340 కేసులు రాజి కుదుర్చుకునే అవకాశం ఉన్నదని తెలిపారు.. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలన్నారు.




## రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ధృవీకరణ చట్టం 2025ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మెదక్ కలెక్టరేట్ ముందు రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య పిలుపు మేరకు ఈ నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ద్వారా ప్రధాని మోడీకి వినతిపత్రం పంపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు జగదీశ్ చంద్ర, సత్యనారాయణ, మోహన్ రాజ్ తదితరులు పాల్గొని, పెన్షనర్ల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

## వృద్ధ దంపతులపై దాడి

- **5 తులాల బంగారం దోపిడీ**
- **సంఘటన స్థలాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

చిన్న శంకరంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగరాయి గ్రామంలో మధ్యాహ్న సమయంలో దోపిడి ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి వృద్ధ దంపతులు అంజయ్య, సావిత్రి నివాసంలోకి ప్రవేశించి సుత్తితో దాడి చేసి, వారి వద్ద ఉన్న సుమారు 5 తులాల బంగారు ఆభరణాలను దోచుకుని బైక్‌పై పరారయ్యాడు. దాడిలో గాయపడిన దంపతులను స్థానికులు వెంటనే మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ, నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు. వెంట తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్సై నారాయణ గౌడ్ ఉన్నారు.







## విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- **బాలికల ఆరోగ్య రక్షణకు వైద్య శిబిరాలు**
- **మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా వెల్దుర్తి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఆకస్మికంగా సందర్శించారు. మెస్ నిర్వహణ, అల్పాహారం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషించి, వారికి అందుతున్న వసతులు, విద్యా బోధన, ఇతర సమస్యలపై ఆరా తీశారు. పప్పులు, బియ్యం, ఇతర నిత్యవసర సరుకుల నాణ్యతను తనిఖీ చేసి, మెరుగైన ప్రమాణాలను పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. వంట గదిలో ఉడికించిన అన్నం, కూరల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించి, రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఆర్బిఎస్కే ఆరోగ్య శిబిరం నిర్వహించి బాలికల గైనకాలజీ సమస్యలకు చికిత్సలు అందించడం తోపాటు, బాలికల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. శిబిరాల ద్వారా చిన్నపాటి ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, ఉచితంగా చికిత్స, అత్యున్నత వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. డి.సి.హెచ్.ఎస్ డా.శివదయాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పౌష్టిక ఆహార లోపం, ఐరన్, విటమిన్, థైరాయిడ్, కంటి సమస్యలు, నెలసరి సమస్యలు గుర్తించి వారి పూర్తిస్థాయిలో చికిత్స అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**వస్తువుల పంపిణీలో పారదర్శకత:**

కౌడిపల్లి మండలంలోని కొట్టాల, వెల్మకన్నె గ్రామాల్లో చౌక ధరల దుకాణాలను కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆకస్మిక తనిఖీ చేశారు. మూడు నెలల రేషన్ పంపిణీ విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని చెప్పారు. స్టాక్ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. చౌక ధరల దుకాణాలు సమర్థవంతంగా పనిచేయాలని లబ్ధిదారులు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి నిత్యవసర వస్తువుల పంపిణీ జరగాలని ఆమె ఆదేశించారు. వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్ తదితరులున్నారు.

**సక్రమంగా సన్న బియ్యం సరఫరా**

సక్రమంగా నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. మెదక్ పట్టణంలో మార్కెట్ యార్డ్ దగ్గరగా ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో పెండింగ్ ఉన్న రేషన్ షాపులకు బియ్యాన్ని త్వరగా సరఫరా చేయాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్, ఇష్యూ రిజిస్టర్, గూడ్స్ రిజిస్టర్ రికార్డులను, ఆన్‌లైన్ రికార్డులను, వెయిం గ్ యంత్రాల రసీదులను పరిశీలించారు. మూడు నెలల బియ్యం సరఫరా గురించి కలెక్టర్ ఆరా తీశారు.



## ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

- **14–15 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి**
- **సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి**

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో కీలకమైన హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను జిల్లాలోని 14-15 సంవత్సరాల బాలికలందరికీ మిషన్ మోడ్‌లో అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వైద్య అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ వైద్య శాఖ అధికారులతో హెచ్‌పీవీ వ్యాక్సిన్ అమలు, మహిళా స్వయం సహాయక సంఘాల హెల్త్ ప్రొఫైల్, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను 14-15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలందరికీ తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి డీఆర్‌డీఓఏ,మెప్మా, డీఈఓలతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, బాలికలను సమీప పీహెచ్‌సీలకు తీసుకువచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో స్పెషలిస్ట్ డాక్టర్లతో నిర్వహించిన క్యాంపులు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో టీవీవీపీ స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా నిర్వహించిన స్క్రీనింగ్ కార్యక్రమాల వివరాలను వైద్య అధికారులు కలెక్టర్‌కు వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ అమలుకు సంబంధించి పూర్తి కార్యాచరణ ప్రణాళికతో షెడ్యూల్ సిద్ధం చేయాలని డీఆర్‌డీఓఏ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓఏ జ్యోతి, అడిషనల్ పీడీ సూర్యారావు, డీసీహెచ్ఎస్ కవిత,జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ,డాక్టర్ శశాంక్ తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు

- **నేడు రెసిడెన్షియల్ స్కూల్స్ లో వైద్య శిబిరాలు**
- **సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**




జిల్లాలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం (అర్ బిఎస్కె) టీవీవీపీ ఆధ్వర్యంలో 100 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా జిల్లాలోని వివిధ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విస్తృత స్థాయిలో నేడు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మండలం లింగంపల్లి టీఎస్ఆర్ఈఐఎస్, కేజీబీవీ, సంగారెడ్డి టీఎస్ఆర్ఈఐఎస్, కల్హేర్ మినీ గురుకులం, టిడబ్ల్యుఆర్ఈఐఎస్ నాగల్ గిద్ద, టీఎంఆర్ఈఐఎస్ పటాన్చెరు, ఇస్నాపూర్, అల్గోల్, కేజీబీవీ రాయికోడ్, అందోల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రత్యేక వైద్య బృందాలు విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరాల్లో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి, చెవి, దంత సంబంధిత సమస్యలు, పోషకాహార లోపాలు వంటి వ్యాధులను గుర్తించి తక్షణ చికిత్స అందించడంతో పాటు, అవసరమైతే ఉన్నత వైద్య సేవలకు రిఫర్ చేయనున్నట్లు తెలిపారు.విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మార్చి 26న సంగారెడ్డి పట్టణంలోని మార్కెస్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూ పి హెచ్ సి)లో స్పెషలిస్ట్ డాక్టర్లతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు వివిధ వ్యాధుల పై పరీక్షలు నిర్వహించి నాణ్యమైన వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు

- **ఎస్ఐ మానస**

**ముద్ర, సిద్ధిపేట:**



ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు సిద్ధిపేట జిల్లా రాయపోల్ ఎస్ఐ మానస తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బందితో కలిసి రాయపోలు గజ్వేల్ రోడ్డు పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేశారు. ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనాలను నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా బుధవారం గజ్వేల్ ఏడీఎం కోర్టు మెజిస్ట్రేట్ మణివీర్ ముందు హాజరు పరచగా 3 రోజులు జైలు శిక్ష విధించారు.

## త్వరగా సర్వే చేయాలి

- **నిమ్జ్ పరిశ్రమ భూముల్లో సదుపాయాల కల్పనకు ప్రణాళికలు**
- **సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి**



జహీరాబాద్ నిమ్జ్ పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను అనుసంధానిస్తూ మౌలిక సదుపాయాల ప్రణాళిక రూపొందించేందుకు సర్వే కీలకమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. జిల్లాలోని టీజీఐఐసీ భూములు, అలాగే నిమ్జ్ఏ / ఎన్ఐసీడీసీ పరిధిలోని భూముల అభివృద్ధి, సర్వే ప్రక్రియలపై జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నిమ్జ్, టీజీఐఐసీ, సర్వే, రెవెన్యూ అధికారులతో కలిసి బుధవారం సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు లేఅవుట్ అభివృద్ధి కోసం త్వరిత గతిన సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు అనుగుణంగా సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జహీరాబాద్ నిమ్జ్ పరిధిలో భూముల అనుసంధానం, మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించడంలో సర్వే కీలకమని మరోసారి స్పష్టం చేశారు. సర్వే పనులు వేగవంతం చేసేందుకు రెవెన్యూ, సర్వే, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కొలతలతో సర్వే పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, భూ స్వాధీనం ప్రక్రియలో ఉన్న అంశాలను సమీక్షించారు. అడ్వాన్స్ పొజెషన్, భూముల బదిలీ అంశాలపై ప్రత్యేకంగా చర్చించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని నిర్ణయించారు. పరిశ్రమల అభివృద్ధికి ఆటంకాలు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ కలెక్టర్ మాధురి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ విఠల్, జహీరాబాద్ ఆర్డీవో దేవుజా, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**స్పాట్ ఫిక్సింగ్ షాక్ (2013)**

బ్యాన్లు, విచారణలతో లీగ్ ప్రతిష్ట దెబ్బతిన్న సమయం.




# నేత కార్మికులను ఆదుకోండి

- **రూ.38 కోట్ల విద్యుత్ భారం, సర్ ఛార్జీలను మాఫీ చేయండి**
- **నిరంతర విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలి**
- **ఆర్థిక శాఖ మంత్రి భట్టికి కేటీఆర్ విజ్ఞప్తి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను కుదిపేస్తున్న ఆర్థిక కష్టాల నుంచి నేతన్నలను గట్టెక్కించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న సిరిసిల్ల నియోజకవర్గంలోని పవర్ లూమ్ పరిశ్రమపై పడుతున్న విద్యుత్ భారాలను తొలగించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన భట్టి విక్రమార్కను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అందులో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న సుమారు రూ.38 కోట్ల విద్యుత్ భారంతో పాటు, పేరుకుపోయిన బ్యాక్ బిల్లింగ్, సర్‌ఛార్జ్‌లను తక్షణమే మాఫీ చేయాలని కోరారు. గతంలో ఉన్న విధంగానే పరిశ్రమకు నిరంతర విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమ సంక్షోభంలో ఉండటంతో కార్మికులు మళ్లీ ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉందని, వారికి తక్షణమే ఆర్థిక వెసులుబాటు కల్పించి భరోసా ఇవ్వాలని డిప్యూటీ సీఎంను కోరారు. సిరిసిల్ల నేతన్నల సమస్యలను కేటీఆర్ వివరించగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ బకాయిల అంశాన్ని పరిశీలించి, కార్మికులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.




# సంఘాల బలోపేతానికి కృషి

- **టీజీఎఫ్‌సీఓ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థిక బలోపేతానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీజీఎఫ్‌సీఓ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గంగాపుత్ర సంఘం, సబ్జీమండిలో ఐదు సొసైటీలకు చెందిన 280 మంది సభ్యులకు "మత్స్యకారుల కోసం సుస్థిర జీవనోపాధి కార్యక్రమం" పై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి కుమార్ మాట్లాడుతూ సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో అనేక అంశాలపై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం చైర్మన్ శిక్షణా మాన్యువల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ డాక్టర్ రజిని, సొసైటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇప్ప సారాపై హీటెక్కిన అసెంబ్లీ

- **అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై రాకేశ్ రెడ్డి సెటైర్లు**
- **ఆ సారాకు ఇందిరమ్మ పేరు పెట్టొద్దని వ్యాఖ్య**
- **రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఇప్ప సారా అంశంపై అసెంబ్లీలో చర్చ అధికార, విపక్ష పార్టీ సభ్యుల మధ్య రచ్చకెక్కింది. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఇప్ప పువ్వు సారాపై బుధవారం అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించారు. తెలంగాణలోని ఆదివాసీలు, ఎస్టీ లను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇప్ప పువ్వు సారా తయారీకి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతుందని వివరించారు. అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి సెటైర్లు వేశారు. ఇప్ప సారా ద్వారా 130 దేశాల్లో ఆదాయం వస్తుందని అనిరుధ్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఇప్ప సారా తయారు చేస్తే, దానికి ఇందిరమ్మ పేరు మాత్రం పెట్టవద్దని సెటైర్లు వేశారు. రాకేశ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో ఇందిరమ్మ పేరు తీయడం ఎందుకని ప్రశ్నించారు. రాకేశ్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరమ్మ పేరు ఎత్తడం మహిళా లోకాన్ని అవమానించడమేనని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.. రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మాట్లాడుతూ గంటకు పైగా సభా సమయం వృథా చేయడం సరికాదన్నారు.

## ఇప్ప పువ్వు సారా తయారీకి ప్రత్యేక కార్పొరేషన్

- **జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలోని ఆదివాసీలు, ఎస్టీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇప్ప పువ్వు సారా తయారీకి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతుందని వివరించారు. గిరిజనులకు మెరుగైన ఉపాధి లభిస్తుందని అన్నారు. ఇప్ప పువ్వు వినియోగం, దాని ద్వారా గిరిజనులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. తన నియోజకవర్గ పరిధిలోని తాండాల ప్రజలు గతంలో ఇప్ప పూల సారా తాగి వంద ఏళ్ల వరకు ఆరోగ్యంగా జీవించారని ఆయన గుర్తు చేశారు. .

# డబుల్ నిర్మాణాలు పూర్తిచేస్తాం

- **త్వరలో 1.12 లక్షల ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు**
- **జూన్ నాటికి మరో లక్ష ఇండ్లు పూర్తి**
- **పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లకు కార్యాచరణ**
- **అసెంబ్లీలో హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అసంపూర్తిగా ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయిస్తామని హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. శాసనసభ సమావేశాల్లో బుధవారం సుమారు 22 మంది ఎమ్మెల్యేలు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ల తదితరల అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి వివరణ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా త్వరలో ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు.

**మూడు దశల్లో సమస్యల పరిష్కారం ..**

ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి మూడు విభాగాలుగా సమస్యలను విభజించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రెండు లక్షల పైచిలుకు ఇండ్లను మంజూరు చేసి హైదరాబాద్ ప్రాంతానికి లక్ష ఇండ్లను కేటాయించిందన్నారు. వీటిలో 78,861 ఇండ్లు పూర్తయినా మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని వివరించారు. జిహెచ్ఎంసీ పరిధిలో 26 కాలనీలు అసంపూర్తిగా ఉండిపోయాయన్నారు. తాము గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 92వేల ఇళ్లలో 62వేల ఇళ్లు పూర్తి చేశామని చెప్పారు. నగరంలో నాటి ప్రభుత్వం 23,500 ఇండ్లను కేటాయించిందన్నారు. అయితే నగరంలో వృత్తి వ్యాపారాలు చేసుకునే వారు సమారు 2030 కిలోమీటర్ల దూరంలో కేటాయించిన ఇండ్లలోకి రాకపోవడంతో 12వేలకు పైగా ఇండ్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దీనిపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించామన్నారు. లబ్ధిదారులకు మరో అవకాశాన్ని కల్పిస్తూ రెండు నెలల్లోగా వీటిలో గృహప్రవేశాలు చేయాలని నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఒకవేళ వారు రాలేక పోతే సుమారు 510 కిలోమీటర్ల పరిధిలో ఉండేవారికి కేటాయించేందుకు నిర్ణయించామన్నారు.

2017లో చేపట్టిన కాలనీలకు మౌలిక సదుపాయాలకు సంబంధించి గతంలో రూపొందించిన ఎస్టిమేషన్లు రద్దుచేస్తూ జీవో ఇచ్చామన్నారు. జర్నలిస్టుల కాలనీలకు కూడా మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. 99 రోజులు ప్రణాళికా కార్యక్రమంలో లబ్దిదారుల ఎంపిక పూర్తిచేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలకు గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షునిగా ఉంటారన్నారు. వారి ఆధ్వర్యంలోని కమిటీ నిరుపేదలను ఎంపిక చేస్తే కేటాయింపులు జరుగుతాయన్నారు. ఈ కమిటీల్లో ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించేలా పరిశీలిస్తామన్నారు.

రాష్ట్రంలో ఈ నెలాఖరు నాటికి సుమారు లక్షా 12వేల ఇందిరమ్మ ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలు జరగనున్నాయని తెలిపారు. వచ్చే జూన్ నాటికి మరో లక్ష ఇండ్ల నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. గతంలో గృహలక్ష్మి పథకం కింద ప్రారంభించి అసంపూర్తిగా ఆగిపోయిన ఇండ్లకు నిధులు ఇస్తామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి గాను ఇప్పటికే స్థలాలను గుర్తించామని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ముఖ్యపట్టణాల్లోనూ ఇదే పద్ధతిని అమలు చేస్తామని స్పష్టం చేశారు.

# డాక్టర్ వర్సెస్ ఫార్మా కంపెనీలు

- **ఓఆర్ఎస్ లేబుల్ వివాదం**
- **ఒంటరి పోరాటం చేసి గెలిచిన పిల్లల డాక్టర్**
- **జీర్ణించుకోలేని ఫార్మా కంపెనీలు**
- **పోరాటం చేసిన డాక్టర్ కు లీగల్ నోటీసులు**
- **దేశ వ్యాప్తంగా వైద్య సంఘాల తిరుగుబాటు**
- **ఫార్మా కంపెనీలపై మండిపడ్డ వైద్యులు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఓఆర్ఎస్ లేబుల్ వివాదంలో హైదరాబాద్ డాక్టర్ సాధించిన విజయాన్ని ఫార్మా కంపెనీలు జీర్ణించుకోవడం లేదు. ఒంటరిపోరు చేసి ఫార్మా కంపెనీలపై గెలిచిన వైద్యురాలిని ఇంకా వేధిస్తూనే ఉన్నారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన చిన్న పిల్లల డాక్టర్ శివరంజని సంతోష్‌కు ఫార్మా కంపెనీలు లీగల్ నోటీసులు ఇవ్వడాన్ని FAIMA, HRDA వంటి వైద్య సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఓఆర్ఎస్ లేబులింగ్ లోపాలపై ఆమె చేసిన పోరాటాన్ని అణిచివేసే ప్రయత్నమని ఆయా అసోసియేషన్ల ప్రతినిధులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. రోగుల భద్రత కోసం గళమెత్తిన వైద్యురాలికి అండగా నిలుస్తామని, నోటీసులు వెనక్కి తీసుకోకపోతే దేశవ్యాప్త ఆందోళనలు సిద్ధమవుతామని వైద్య సంఘాల ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్) లేబులింగ్ లోపాలపై పోరాటం చేసి విజయం సాధించిన హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ శివరంజని సంతోష్‌కు ఫార్మా కంపెనీలు లీగల్ నోటీసులు జారీ చేయడంపై దేశ వ్యాప్తంగా వైద్య సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. ఓఆర్ఎస్ ప్యాకెట్ల లేబులింగ్‌లో సంస్కరణలు ఉండాలని, ప్రజారోగ్యం దృష్ట్యా తప్పుదోవ పట్టించే ఉత్పత్తులపై ఆమె చేసిన సోషల్ మీడియా అవగాహన కార్యక్రమాలపై ఆగ్రహించిన కొన్ని ఫార్మా సంస్థలు ఈ నోటీసులు పంపగా.. ఈ చర్యను డాక్టర్ల వృత్తిపరమైన స్వేచ్ఛను హరించడమేనని వైద్య సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. డాక్టర్ శివరంజని లేవనెత్తిన అంశాలు పూర్తిగా రోగుల భద్రత, శిశువుల ఆరోగ్యానికి సంబంధించినవని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ ( FAIMA ) పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన ఓఆర్ఎస్‌కు బదులుగా.. కేవలం గ్లూకోజ్ కలిపిన ఉత్పత్తులను ప్రజలకు విక్రయించడం వల్ల అనర్థాలు జరుగుతాయని హెచ్చరించటం ఒక వైద్యురాలిగా ఆమె బాధ్యత అని ఫైమా స్పష్టం చేసింది.

**మద్దతుగా వైద్యులు..**

తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సైతం ఈ నోటీసులను తీవ్రంగా ఖండించాయి. పేషెంట్ల ఆరోగ్యం కోసం పోరాడే డాక్టర్లను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఒక డాక్టర్ సామాజిక బాధ్యతతో పనిచేస్తున్నప్పుడు ఆమెను అడ్డుకోవడం అంటే సమాజ ఆరోగ్యానికి విఘాతం కలిగించడమేనని విమర్శించారు. ఈ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోకపోతే దేశవ్యాప్తంగా వైద్య సంఘాలతో సమన్వయం చేసుకుని భారీ ఎత్తున నిరసనలు చేపడతామని అసోసియేషన్ల ప్రతినిధులు హెచ్చరించాయి. వైద్యులపై జరుగుతున్న ఇలాంటి కార్పొరేట్ బెదిరింపులకు వ్యతిరేకంగా న్యాయపరంగా కూడా పోరాడతామని వారు స్పష్టం చేశారు.

**శివరంజని పోరాటం ఎందుకు..?**

కాగా, మార్కెట్‌లో లభించే చాలా డ్రింక్స్ ఓఆర్ఎస్ తరహాలోనే ప్యాక్ చేసి ఉండటం వల్ల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఓఆర్ఎస్ పేరిట జరుగుతున్న విచ్చలవిడి దందాపై డాక్టర్ శివరంజని సంతోష్ ఎనిమిదేండ్లుగా పోరాడుతున్నారు. ఓఆర్ఎస్ పేరిట జరుగుతున్న అమ్మకాలపై తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు వేశారు. ప్రధాని మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డాకు లేఖ రాశారు. దీంతో మార్కెట్‌లో ఓఆర్ఎస్ పేరిట సాగిస్తున్న దందాపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఉక్కుపాదం మోపింది. ఇక నుంచి ఆయా బ్రాండ్లు 'ఓఆర్ఎస్' అనే పదాన్ని తమ ఉత్పత్తులపై ప్రింట్ చేయటానికి వీల్లేదని గతేడాది చివర్లో ఆదేశాలు జారీ చేసింది. ఇకపై తయారు చేసే తమ ఉత్పత్తులపై 'డబ్ల్యూహెచ్‌వో రికమండ్ చేసిన ఓఆర్ఎస్ ఫార్ములా' కాదు అని ముద్రించాలని సూచించింది.





# సేవా కార్యక్రమాలు చేపట్టాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

కల్వకుర్తి పట్టణంలోని సత్యసాయి కల్యాణ మండపంలో బుధవారం వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో మొదటి క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. వారు చేపడుతున్న కార్యక్రమాలను వివరించి, రాబోయే కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి మొదటి స్థానంలో నిలిపేలా క్లబ్ అధ్యక్షులు, అధికారులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్యాబినెట్ సెక్రటరీ చంద్రశేఖర్, క్యాబినెట్ ట్రెజరర్ శ్రీనివాసులు, క్యాబినెట్ సర్వీస్ సెక్రటరీ బాదం శివకుమార్, జిల్లా స్థాయి అధికారులు, వాసవి క్లబ్ వనిత క్లబ్, అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ కలిమిచెర్ల రమేష్ జిల్లా బాధ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. సమావేశంలో క్లబ్ అభివృద్ధి, సేవా కార్యక్రమాల విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై దిశ నిర్దేశం చేశారు.

# శీనూ వైట్ల.. సినిమా అంటే ఇది

- **మోసపోయిన దర్శకుడు**
- **రూ. ఏడు కోట్ల భూ కుంభకోణం**
- **పోలీస్ స్టేషన్‌కు చేరిన కేసు**
- **అసలు ఏమైందంటే?**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

దర్శకుడు శ్రీను వైట్లకు సినిమా చూపించారు. కేటుగాళ్ల చూపించిన సినిమాకు దర్శకుడు మోసపోయారు. ఆయనను బురిడీ కొట్టించిన కొందరు కేటుగాళ్లు సుమారు రూ.7 కోట్లకు టోపీ పెట్టారు. దాంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. ప్రముఖ తెలుగు దర్శకుడు శ్రీను వైట్ల కేటుగాళ్లు చేతిలో మోసపోయారు. ఆయనకు టోపీ పెట్టిన ఇద్దరు డబ్బులు కొట్టేశారు. తాను మోసపోయిన సంగతి గ్రహించిన శ్రీను వైట్ల, పోలీసులను ఆశ్రయించారు. ఆ వివరాల్లోకి వెళ్లితే..

**భూ కుంభకోణం కేసు ఏమిటంటే?**

భారీ భూ కుంభకోణంలో శ్రీను వైట్ల చిక్కుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు రూ. 7.2 కోట్ల మేర మోసపోయారు. తన మేనకోడలు శ్వేతతో కలిసి 2019లో కొంత భూమి కొనుగోలు చేయాలని శ్రీను వైట్ల నిర్ణయించుకున్నారు. మధ్యవర్తులు జెట్టిగారి సుధాకర్ రెడ్డి, కావలి కృష్ణ ద్వారా కొందరు వ్యక్తులు ఆయన్ను సంప్రదించారు. పథకం ప్రకారం శ్రీను వైట్ల, శ్వేతను నమ్మించి డబ్బులు కాజేశారు. వికారాబాద్ జిల్లా కద్మూర్‌లో తమకు భూమి ఉందని మాయమాటలు చెప్పడంతో పాటు నకిలీ పత్రాలను సృష్టించి శ్రీను వైట్లకు చూపించారు కేటుగాళ్లు. వాళ్ల మాటలు నమ్మడంతో పాటు భూమి ఉందని భారీ మొత్తంలో (సుమారు ఏడున్నర కోట్లు) నగదు చెల్లించి సేల్ డీడ్లు రెడీ చేసుకున్నారు.

**భారీ మోసం!**

డబ్బులు తీసుకున్న వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయడం లేదు. పలు దఫాలు వాళ్లను సంప్రదించడానికి చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. దాంతో శ్రీను వైట్ల ఆరా తీయగా... ఆ భూములకు సంబంధించిన విషయాలు విచారించగా... ఆ భూమి నిందితులది కాదని, వేరే వ్యక్తులదని తెలిసింది. కుట్రపూరితంగా తనను మోసం చేశారని గ్రహించిన ఆయన... హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీను వైట్ల ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు... ప్రధాన నిందితులు జి. ప్రభాకర్ రెడ్డి, మంచంపల్లి ఆనందంతో పాటు మరో పది మందిపై కేసు నమోదు చేశారు. సినిమాల విషయానికి వస్తే... చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో సినిమా చేయడానికి శ్రీను వైట్ల రెడీ అవుతున్నారు. వచ్చే ఏడాది (2027) సంక్రాంతికి ఆ సినిమా విడుదల కానుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
26.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఐపీఎల్ మెమొరీస్ :. ఎస్ఎస్‌కే & ఆర్ఆర్ బ్యాన్ రెండు సీజన్లు రెండు పెద్ద టీమ్స్ లేకపోవడం పెద్ద షాక్.



## కబ్జాదారుల నుండి శంభుని కుంటను కాపాడాలి

- **హైడ్రా కమిషనర్ కు వినతి పత్రం అందించిన నాయిని**

**ముద్ర, శేరిలింగంపల్లి :**
సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలంలోని బీరంగూడ లో ఉన్న శంభునికుంటను కబ్జాదారుల నుంచి కాపాడి ప్రజలందరికీ ఉపయోగపడేలా సుందరీకరణ చేయాలని సీపీఎం నాయకులు నాయిని నరసింహారెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులను కాపాడాలని చుట్టుపక్కల ఉన్న కాలనీ వాసుల సంతకాల సేకరణతో కలెక్టర్ కు అందించినా, నిరాహార దీక్షలు, ధర్నాలు చేసినా పట్టించుకోలేదన్నారు. రెవెన్యూ అధికారుల రికార్డుల ప్రకారం శంభుని కుంట సర్వే నెంబర్ 765లో 22 ఎకరాల 12 గుంటల భూమి ఉందని తెలిపారు. రాజకీయ నాయకులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల అండదండలతో పెద్ద ఎత్తున కబ్జాలు జరిగాయని ఆరోపించారు. కుంటలోకి నీరు వచ్చే కాలువలు, బయటికి వెళ్లే కాలువలను కబ్జా చేశారన్నారు. వర్షాకాలంలో అనేక కాలనీలు జలమయం అవుతున్నాయన్నారు. కుంటలో చెత్తాచెదారం, గుర్రపు డెక్క, డ్రైనేజీ నీరు రావడం వల్ల కుంట పూర్తిగా కలుషితమై పోయిందన్నారు. కలుషిత నీరు వల్ల దుర్వాసన, దోమలతో చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులు విష జ్వరాలతో తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. హైడ్రా అధికారులు జోక్యం చేసుకొని కబ్జాదారుల నుంచి కుంటను కాపాడి కాలువలను పునర్నిర్మాణం చేసి ప్రజలందరికీ ఉపయోగపడేలా సుందరీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పెట్రోల్, గ్యాస్ నిల్వలపై ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి

- **బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**ముద్ర, కుత్బుల్లాపూర్ :**



"నో స్టాక్" బోర్డులతో పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులపై బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి వాటి సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వము కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేసి నిల్వ చేసుకున్నట్లయితే ప్రజలు ఇబ్బందులు పడేవారు కాదన్నారు. ప్రస్తుతం యుద్ధం ఉన్న దేశాల కంటే యుద్ధం లేని మన దేశంలోనే ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. దీనికి తోడు ప్రధాని మోదీ కరోనా వంటి పరిస్థితులకు ప్రజలు సిద్ధంగా ఉండండి అనడంతో ప్రజలు మరింత అయోమయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భేషజాలకు పోకుండా సమన్వయపరచుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

## తాండూర్ మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

**ముద్ర, తాండూర్:**




వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపాలిటీ అంచనా బడ్జెట్ కు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్ పర్సన్ శ్రీమతి పట్లోళ్ల నీరజ అధ్యక్షతన ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 20262027 ఆర్థిక సంవత్సరం సవరణ అంచనా సాధారణ ఆదాయం రూ. 2,751.44 లక్షలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ. 10.29 లక్షల ప్రారంభ నిల్వతో ఈ బడ్జెట్ ని ఆమోదం తెలిపారు. 2026-2027 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నుపై రూ. 10.లక్షలు, స్టాంపు డ్యూటీ కింద రూ. కోటి, తై బజార్ కింద రూ. 5 లక్షలు, మున్సిపల్ దుకాణాల ద్వారారూ. 50 లక్షలు, ట్రేడ్ లైసెన్స్ స్పీచ్ ద్వారా రూ. 50 లక్షలు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. పట్టణ ప్రణాళిక ద్వారా లేఅవుట్ ఫీజులు, బిల్డింగ్ క్రమబద్ధీకరణ రుసుము రూ. రూ. 2 కోట్ల 11 లక్షలు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఈ ఆర్థిక సంవత్సరం అంచనా సాధారణ వ్యయం రూ. 2782.64 లక్షలకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. ఆదాయం పెంపునకు కృషి చేద్దాం : చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ తాండూర్ మున్సిపాలిటీలో ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి కౌన్సిలర్ సహకరించాలని, అందరం కలిసి ఆదాయాన్ని పెంచుకుని, ప్రజా సమస్యల పరిష్కరించుకుందామని కోరారు. బడ్జెట్ సమావేశం అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ గ్రాంట్స్ తో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నిధులను కూడా తెచ్చుకుని అభివృద్ధి చేసుకుందామన్నారు. మున్సిపల్ పరిధిలో ఏ కార్యక్రమం జరిగిన కౌన్సిలర్లకు తప్పనిసరి సమాచారం అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కుక్కల నియంత్రణ కోసం జిల్లా కలెక్టర్ కు లేఖ రాస్తున్నట్లు ఆమె సభ్యులకు వివరించారు. శివారు ప్రాంతానికి కూడా మిషన్ భగీరథ తాగునీటి వ్యవస్థను తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు అలాగే పట్టణంలోని పార్కు స్థలాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకొని ఉన్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, వైస్ చైర్ పర్సన్ అబ్దుల్ రజాక్, వివిధ పార్టీల మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నయా హైదరాబాద్

- ఎలివేటెడ్ కారిడార్లు
- గ్రేటర్ లో అండర్ పాసులు
- నగరం చుట్టూ రైలు
- నగరంలో మెట్రో పరుగులు
- దేశంలోనే తొలి ఎయిర్ పోర్ట్ కింద అండర్ పాసు
- మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం
- నడిమధ్యలో భారీ శివుని విగ్రహం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
హైదరాబాద్ శరవేగంగా విస్తరిస్తోంది. పెరిగిన జనాభా, ఆదాయ మార్గాల మెరుగుదలతో ప్రతి ఇంట్లో కార్ల సంఖ్య పెరగడం ట్రాఫిక్ సమస్యను జఠిలం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్‌ను ఒక అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు, ట్రాఫిక్ రద్దీని శాశ్వతంగా పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక బృహత్తరమైన వ్యూహాన్ని ప్రకటించింది. కేవలం రోడ్ల విస్తరణకే కాకుండా ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ సుందరీకరణ వంటి ప్రణాళికలతో నగర రూపురేఖలు మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక స్పష్టమైన రోడ్డు మ్యాప్‌ను రెడీ చేశారు.
హైదరాబాద్ నగర అభివృద్ధిని ప్రభుత్వం మూడు కీలక విభాగాలుగా వర్గీకరించింది. వాటినే క్యూర్, ప్యూర్, రేర్ గా పిలుస్తారు. 783 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌ను క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్ విభాగంలో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్ విభాగంలో అగ్రికల్చరల్ సెక్టార్‌ను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకి తరలించి, నగరాన్ని నివాసయోగ్యంగా మార్చాలని నిర్ణయించారు. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ కార్పొరేషన్లు, నాలుగు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేశారు.

**నలువైపులా ఎలివేటెడ్ కారిడార్లు-.. సిగ్నల్ లేని ప్రయాణం**
నగరం మధ్య నుంచి శివార్ల వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నాలుగు ప్రధాన జంక్షన్లు గౌలిగూడ, చాదర్ ఘాట్, నాగోల్, అంబర్‌పేటలో కారిడార్లను నిర్మిస్తారు. సిగ్నల్స్ వద్ద ఆగకుండా వెళ్లవచ్చు. ముఖ్యంగా మూసీ రిజువెనేషన్ ప్రాజెక్టులో భాగంగా హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి మూసీ నది వెంట గౌరవెల్లి వరకు సుమారు 43 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఈ మార్గంలో గౌలిగూడ, చాదర్ ఘాట్, అంబర్‌పేట, నాగోల్ జంక్షన్ వద్ద ట్రంపెట్లను ఏర్పాటు చేస్తారు. నల్గొండ చౌరస్తా జంక్షన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ జూలై నాటికి అందుబాటులోకి వస్తుంది.

**మెట్రో రైలు రెండో దశ**
హైదరాబాద్ మెట్రో రెండో దశను 24వేల కోట్లతో 76 కిలోమీటర్ల మేర విస్తరించాలని ప్రతిపాదించింది. నాగోల్, ఎల్బీనగర్ ఓవైసీ హాస్పిటల్, చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో లైన్ పొడిగిస్తారు. గౌలిగూడ వద్ద ఆగిన మెట్రో పనులను పునరుద్ధరించి ఫలక్‌నుమా, చాంద్రాయగుట్ట జంక్షన్ కనెక్ట్ చేయనున్నారు. అలాగే ఐటీ ఉద్యోగుల కోసం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలీస్ వరకు, బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం నుంచి చందానగర్ వరకు మెట్రోను విస్తరించనున్నారు.

**డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్**
ఎల్బీనగర్ హయత్ నగర్ మధ్య రూ.941 కోట్లతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ను నిర్మిస్తున్నారు. దీంతో 70 కాలనీలలోని 12 లక్షల మందికి ఉపయోగకరంగా ఉంటుంది. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు అటు మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించనున్నారు.

**ఎయిర్ పోర్ట్ కింది నుంచి అండర్‌పాస్**
బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద మల్టీ లేన్ అండర్‌పాస్ నిర్మించేందుకు కేంద్ర సంస్థ అయిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతులిచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలిలో వెల్లడించారు. ఇది పూర్తయితే కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది.

**బేగంపేట రన్‌వే కింద అండర్‌పాస్**
సుచిత్ర జంక్షన్ నుంచి ప్యారడైజ్ సర్కిల్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా బేగంపేట విమానాశ్రయ రన్‌వే కింద అండర్‌పాస్‌ను మల్టీ లేన్ విధానంలో నిర్మిస్తారు. దీంతో ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుంచి నగరంలోకి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ ట్రాఫిక్ సమస్య తలెత్తదు.

**మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం..**
మూసీ నది పరీవాహక ప్రాంతాన్ని మత సామరస్యానికి ప్రతీకగా అభివృద్ధి చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగా మంచిరేవులలో 800 ఏళ్ల చరిత్ర కలిగిన వీర భద్రస్వామి ఆలయ ప్రాంగణంలో భారీ 'ఓంకారేశ్వర మందిరం' నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి మార్చి 28న శంకుస్థాపన చేయనున్నారు. రూ. 700 కోట్ల అంచనా వ్యయంతో, శృంగేరి పీఠం సూచనల మేరకు ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. అలాగే నదిలో వంద అడుగుల శివుని విగ్రహం, పార్కులు, బోటింగ్ సౌకర్యాలతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ తీరాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు 202627 రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 1500 కోట్లు ప్రత్యేకంగా కేటాయించారు. బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ నిర్మించి 150 మీటర్ల ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహం, మ్యూజియం, ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. తీరంలో నాలుగు మతాలకు సంబంధించిన ప్రార్థనాలయాలను నిర్మించి.. అభివృద్ధి పనులను మత సామరస్యానికి ప్రతీకగా నిలపాలని నిర్ణయించారు. మంచిరేవులలోని పురాతన వీరభద్రస్వామి ఆలయం, పురానాపూల్ వద్ద భారీ మసీదు, గౌలిగూడ వద్ద గురుద్వారా, నాగోల్‌లో చర్చి నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## భూదందాలకు పాల్పడుతున్న ఐదుగురు కేటుగాళ్ళు అరెస్ట్

- **నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు**
- **కీసర పోలీసుల చాకచక్యం**

**ముద్ర, మల్కాజ్‌గిరి**




అమాయకుల భూములపై కన్నేసి, నకిలీ పత్రాలతో కాజేయాలని చూసిన భారీ భూకబ్జా ముఠాను కీసర పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ ముఠాలో ఒక పోలీసు అధికారి కూడా ఉండటం గమనార్హం. మరణ ధృవీకరణ పత్రాల నుంచి కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ల వరకు అన్నింటినీ ఫోర్జరీ చేస్తూ, యజమానులకు తెలియకుండానే ఆస్తులను రిజిస్ట్రేషన్ చేస్తున్న నిందితులను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 16, 17 తేదీల్లో కేశబోయిన రమాదేవి, మదాను మాధురి అనే మహిళలు తమ భూములను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఫోర్జరీ పత్రాలతో ఇతరులకు బదలాయించారని కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ ముఠా ప్రధానంగా ఖాళీగా ఉన్న ప్లాట్లను, యజమానులు అందుబాటులో లేని భూములను లక్ష్యంగా చేసుకుంటుంది. మొదట అసలు యజమానుల వివరాలు సేకరించి, వారు చనిపోయినట్లు నకిలీ 'డెత్ సర్టిఫికేట్లు' సృష్టిస్తారు. ఆపై నకిలీ వారసులను పుట్టించి, గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్లు, సేల్ డీడ్ల ద్వారా భూములను తమ అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తారు. రెండు వేర్వేరు కేసుల్లో పోలీసులు నిందితులను గుర్తించారు. మొదటి కేసులో కనకాటి లింగయ్య గౌడ్ (ఏఎస్ఐ), ప్రవీణ్ రెడ్డి, మోడెమ్ సంపత్, కాంబ్లే దీపలను అరెస్ట్ చేయగా రెండో కేసులో ఉప్పల వేణు, దొనపాటి వెంకట్ రెడ్డి, గుండిగ జ్యోతి, మదాను ఇన్నయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఫోర్జరీ చేసిన పత్రాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి బృందాన్ని మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ అభినందించారు. భూముల కొనుగోలు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లావాదేవీలు జరపాలని ఆయన సూచించారు.

## ఉపాధి కోసం నైపుణ్య శిక్షణ




- **ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి తెలిపారు. బుధవారం నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని రెడ్ క్రాస్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని యువతకు వివిధ వృత్తి కోర్సుల్లో శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రెడ్ క్రాస్ సంస్థ నిర్మించిన భవనంలో త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వివిధ సంస్థలను భాగస్వామ్యం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం నూతన శిక్షణ కోర్సులను రూపొందిస్తోందని, విద్యారంగంలో సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం రెడ్ క్రాస్ కార్యకలాపాల అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ స్టేట్ మెంబర్ రమేష్ రెడ్డి, ట్రెజరర్ కృష్ణారావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ముచ్చర్ల దినకర్, ఉండ్యాల రాజమహేందర్ రెడ్డి, మధు, పి. శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

**ముద్ర, గద్వాల:**
కే.టి.దొడ్డి మండలంలోని ఇర్కిచేడు గ్రామానికి చెందిన మహమ్మద్ జిందావలిపై గువ్వలదిన్నె గ్రామంలో జరిగిన దాడి కేసులో గద్వాల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి. ఉదయ్ నాయక్ బుధవారం నిందితుడు కృష్ణమోహన్ రెడ్డికి మూడేళ్లు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.200 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ టి. శ్రీనివాసరావు, తెలిపారు. 2022 సెప్టెంబర్ 3న మహమ్మద్ జిందావలి తన స్నేహితులు వినోద్ కుమార్, కురువ ఆంజనేయులు, భూపతి రెడ్డి తో కలిసి మంత్రాలయం వెళ్లి తిరుగు ప్రయాణంలో గువ్వలదిన్నె గ్రామంలో టీ తాగడం కోసం ఆగాడు. అదే గ్రామానికి చెందిన కృష్ణమోహన్ రెడ్డి, వినోద్ కుమార్‌పై కట్టెతో దాడి చేశాడు. వీరిని అడ్డుకునేందుకు వెళ్లిన జిందావలిపై కూడా దాడి చేసి గాయపరిచాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ కే. శంకర్, డీఎస్పీ వై. మొగిలయ్య, టి. శ్రీను పర్యవేక్షణలో కేసు ట్రయల్ అనంతరం ఏపీపీ రాచెల్ సంజనా జాషువా వాదనలు బలంగా వినిపించగా, సాక్షులను సమయానికి హాజరుపరచడంలో కోర్టు సిబ్బంది కీలక పాత్ర పోషించారు. అదనపు ఎస్పీ కే శంకర్ డీఎస్పీవై మొగిలయ్య, గద్వాల్ సిఐ టి శ్రీను, ప్రస్తుత కే.టి.దొడ్డి ఎస్ఐ శ్రీనివాసులు, కోర్టు లైసెన్ ఆఫీసర్ ఎస్సై జిక్కి బాబు కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ పిసి మహేష్‌ను ఎస్పీ అభినందించారు.



**ఐపీఎల్ మెమొరీస్ : ఎంఎస్ ధోని కోపం (2019)**

అంపైర్లపై ఫీల్డ్‌లోకి వచ్చి ఆగ్రహం వ్యక్తం చేసిన అరుదైన ఘటన.








# ఐపీఎల్‌లో గుర్తుండిపోయే ఘటనలు

### ఉత్కంఠ, వివాదాలతో ప్రత్యేక గుర్తింపు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ కేవలం క్రికెట్ లీగ్ మాత్రమే కాకుండా అభిమానులకు ఎన్నో మరిచిపోలేని అనుభవాలను అందించిన టోర్నీగా నిలిచింది. ప్రతి సీజన్‌లో స్టార్ ఆటగాళ్ల ప్రదర్శనలపై భారీ ఆసక్తి కనిపిస్తూ ఉంటుంది. మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి ఆటగాళ్లు మైదానంలోకి దిగితే అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంటుంది. మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగి సూపర్ ఓవర్ల వరకు వెళ్లిన సందర్భాలు కూడా అనేకం. ముఖ్యంగా 2020 సీజన్‌లో పలుమ్యాచ్‌లు సూపర్ ఓవర్లతో ముగియడం అభిమానులకు మరింత థ్రిల్ కలిగించింది. ఇక ఐపీఎల్ చరిత్రలో వివాదాలు కూడా తక్కువగా లేవు. హర్భజన్ సింగ్, శ్రీశాంత్ మధ్య జరిగిన ఘర్షణ, స్పాట్ ఫిక్సింగ్ కేసులు, కొన్ని జట్లపై నిషేధాలు వంటి ఘటనలు పెద్ద చర్చకు దారితీశాయి. 2019 సీజన్‌లో అంపైర్ నిర్ణయంపై మహేంద్ర సింగ్ ధోని మైదానంలోకి వచ్చి ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన కూడా అప్పట్లో సంచలనం సృష్టించింది. అలాగే విరాట్ కోహ్లీ, గౌతమ్ గంభీర్ మధ్య జరిగిన వాగ్వాదం కూడా ఐపీఎల్‌లో అత్యంత వివాదాస్పద సంఘటనల్లో ఒకటిగా నిలిచింది. ఉత్కంఠభరిత మ్యాచ్‌లతో పాటు ఇలాంటి సంఘటనలతో ఐపీఎల్ ఎప్పటికప్పుడు అభిమానుల్లో ఆసక్తిని కొనసాగిస్తోంది.

# ఆర్సీబీ యాజమాన్యం మార్పు..

**ఐపీఎల్‌లో చర్చనీయాంశంగా గత విజేత జట్టు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్‌లో గత సీజన్ విజేతగా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) యాజమాన్యం మార్పు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆర్సీబీ మాతృ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ జట్టును విక్రయించినట్లు జాతీయ మీడియాలో వార్తలు వెలువడుతున్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ ఆధ్వర్యంలోని కన్సార్షియం ఈ జట్టును కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ కన్సార్షియంలో విదేశీ పెట్టుబడి సంస్థలు, మీడియా సంస్థలు భాగస్వాములుగా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం డీల్ విలువ 1.78 బిలియన్ డాలర్లు కాగా, భారత కరెన్సీలో దాదాపు రూ.16,706 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఐపీఎల్ చరిత్రలో చెన్నై, ముంబై జట్లు అత్యంత విలువైన జట్లుగా గుర్తింపు పొందినప్పటికీ, ఇటీవల ఆర్సీబీ జట్టు విలువ వేగంగా పెరిగినట్లు తెలుస్తోంది. జట్టుకు ఉన్న భారీ అభిమాన మద్దతు, సోషల్ మీడియాలో విపరీతమైన ప్రజాదరణ, ప్రతి ఏడాది ఐపీఎల్ ప్రారంభానికి ముందు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలు జట్టు బ్రాండ్ విలువను పెంచాయి. అభిమానులతో అనుసంధానం పెంచే కార్యక్రమాలు, పెద్ద కార్పొరేట్ సంస్థలతో కుదుర్చుకునే ఒప్పందాలు కూడా జట్టు మార్కెట్ విలువ పెరగడానికి దోహదపడ్డాయి. గత సీజన్‌లో ఐపీఎల్ ట్రోఫీ సాధించడం కూడా జట్టు విలువ మరింత పెరగడానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యునైటెడ్ స్పిరిట్స్ సంస్థ సరైన సమయంలో జట్టును విక్రయించాలని నిర్ణయించినట్లు సమాచారం. యునైటెడ్ స్పిరిట్స్ సంస్థ ప్రధానంగా మద్యం తయారీ, విక్రయాలపై దృష్టి సారించడంతో తన ప్రధాన వ్యాపారంపైనే పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని భావించినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ చరిత్రలో యాజమాన్య మార్పులు గతంలో కూడా చోటు చేసుకున్నాయి. గతంలో డెక్కన్ చార్జర్స్ జట్టు యాజమాన్యంలో మార్పులు చోటుచేసుకుని అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్‌గా మారిన విషయం తెలిసిందే. తాజా పరిణామాలతో ఆర్సీబీ యాజమాన్యం మార్పు ఐపీఎల్ భవిష్యత్ వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. అభిమానుల్లో కూడా కొత్త యాజమాన్యం జట్టును మరింత బలోపేతం చేస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.





# న్యూజిలాండ్ గడ్డపై దక్షిణాఫ్రికా చరిత్ర


### మొట్టమొదటి టీ20 సిరీస్‌లో విజయం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న దక్షిణాఫ్రికా జట్టు చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. నిర్ణయాత్మక ఐదో టీ20లో 33 పరుగుల తేడాతో న్యూజిలాండ్ జట్టును ఓడించి 5 మ్యాచ్‌ల సిరీస్‌ను 32తో కైవసం చేసుకుంది. న్యూజిలాండ్ గడ్డపై దక్షిణాఫ్రికాకు ఇది తొలి టీ20 సిరీస్ విజయం కావడం విశేషం. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 187 పరుగుల భారీ స్కోరు చేసింది. యువ బ్యాటర్ కానర్ ఎస్టెర్‌హజెన్ 33 బంతుల్లో 75 పరుగులతో అజేయంగా నిలవగా, రూబిన్ హెర్మన్ 39 పరుగులతో జట్టుకు మంచి ఆరంభం అందించాడు. 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు దక్షిణాఫ్రికా బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనకు తట్టుకోలేకపోయింది. గెరాల్డ్ కోయెట్జీ, ఒట్నీల్ బార్ట్‌మాన్, వియాన్ ముల్డర్ తలా రెండు వికెట్లు సాధిస్తూ ప్రత్యర్థిని కట్టడి చేశారు. బెవాన్ జాకబ్స్ 36 పరుగులు చేసినప్పటికీ మిగిలిన బ్యాటర్లు విఫలమవడంతో న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులకే పరిమితమైంది. అద్భుత బ్యాటింగ్‌తో రాణించిన కానర్ ఎస్టెర్‌హజెన్ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ మెరుగైన ప్రదర్శన కనబరిచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను అందుకున్నాడు.

# టైటిల్ కోసం 18 ఏండ్లుగా ఎదురుచూపు

**ఐపీఎల్ కప్ పై పంజాబ్, ఢిల్లీ ఆశలు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు టైటిల్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నాయి. 18 ఏండ్లుగా లీగ్‌లో కొనసాగుతున్న ఈ జట్లు ఒక్కసారి కూడా ట్రోఫీని అందుకోలేకపోయాయి. ప్రతి సీజన్‌లో కొత్త ఆశలతో బరిలోకి దిగుతున్నప్పటికీ కీలక దశల్లో విఫలమవుతూ అభిమానులను నిరాశపరుస్తున్నాయి. ఇప్పటివరకు పేర్లు మార్చుకోవడం, జట్టులో మార్పులు చేయడం వంటి చర్యలు తీసుకున్నా ఫలితం మాత్రం మారలేదు. ఈసారి అయినా ఈ రెండు జట్లు తమ నిరీక్షణకు తెరదించి తొలి టైటిల్‌ను సొంతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఐపీఎల్ 2026లో ఈ జట్ల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.




# కాలియా.. తేరా క్యా హోగా' అంటూ వేధించారు..

**వర్ణ వివక్షపై శివరామకృష్ణన్ ఆవేదన**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
భారత మాజీ లెగ్ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ తన కెరీర్‌ను ప్రభావితం చేసిన వర్ణ వివక్ష ఘటనలను గుర్తుచేసుకున్నారు. ఒక జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చిన్న వయసులోనే తనపై జరిగిన అవమానాలను వెల్లడించారు. చెపాక్ స్టేడియంలో నెట్ బౌలర్‌గా వెళ్లిన సమయంలో ఓ సీనియర్ ఆటగాడు తనను గ్రౌండ్ సిబ్బందిగా భావించి బూట్లు శుభ్రం చేయమని చెప్పిన ఘటన తనను తీవ్రంగా బాధించిందని తెలిపారు. తమిళనాడు జట్టులో ఆడుతున్న సమయంలో కొందరు తనను రంగు ఆధారంగా ఎగతాళి చేసేవారని, ముంబై, చండీగఢ్, జలంధర్ నగరాల్లో ప్రేక్షకులు 'కాలియా.. తేరా క్యా హోగా' అంటూ హేళన చేసిన ఘటనలను గుర్తుచేసుకున్నారు. తన 17వ పుట్టినరోజున కూడా చాక్లెట్ కేక్ విషయంలో సీనియర్ ఆటగాడు చేసిన వ్యాఖ్యలు తనను కన్నీళ్లు పెట్టించాయని తెలిపారు. ఈ ఘటనలు తన మనసుపై చెరగని ముద్ర వేశాయని, తన కెరీర్ ఆశించిన స్థాయిలో సాగకపోవడానికి ఇవి కూడా కారణమయ్యాయని శివరామకృష్ణన్ వెల్లడించారు.



# ఆర్సీబీ ఛైర్మన్‌గా ఆర్యమాన్ బిర్లా !?

### గతంలో ఐపీఎల్ ఆటగాడిగా గుర్తింపు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును ఆదిత్య బిర్లా గ్రూప్ ఆధ్వర్యంలోని కన్సార్టియం భారీ మొత్తానికి కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కుమార్ మంగళం బిర్లా కుమారుడు ఆర్యమాన్ బిర్లా ఆర్సీబీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. విశేషం ఏమిటంటే, ఆర్యమాన్ బిర్లా గతంలో దేశవాళీ క్రికెట్ ఆడటంతో పాటు 2018 ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. మధ్యప్రదేశ్ తరపున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తొమ్మిది మ్యాచ్‌లు ఆడిన ఆర్యమాన్ 414 పరుగులు చేసి, బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ నమోదు చేశాడు. అయితే ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాకపోవడంతో 2020లో ఆ జట్టు అతడిని విడుదల చేసింది. అనంతరం వ్యక్తిగత కారణాలతో క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అతడు, ఇప్పుడు ఆర్సీబీ అభివృద్ధికి కృషి చేయడం గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నాడు.



# ఐపీఎల్ 2026కు కొత్త నిబంధనలు

**డ్రెస్సింగ్ రూమ్‌లోకి కుటుంబ సభ్యులకు నో ఎంట్రీ**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు బీసీసీఐ కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. ఈ టోర్నీలో పాల్గొనే ఆటగాళ్లు తప్పనిసరిగా ఈ నియమాలను పాటించాలని స్పష్టం చేసింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఆటగాళ్ల కుటుంబ సభ్యులకు డ్రెస్సింగ్ రూమ్‌లలోకి అనుమతి ఉండదని తెలిపింది. అలాగే హోటల్ నుంచి స్టేడియానికి వెళ్లే సమయంలో ఫ్రాంచైజీలు ఏర్పాటు చేసిన బస్సుల్లోనే ప్రయాణించాల్సి ఉంటుందని ఆదేశించింది. ప్రాక్టీస్ మ్యాచ్‌ల సమయంలో స్లీవ్‌లెస్ జెర్సీలు ధరించకూడదని, ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ దక్కించుకున్న ఆటగాళ్లు ప్రతి మ్యాచ్‌లో తప్పనిసరిగా వాటిని ధరించాలని సూచించింది. ఈ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే మొదటిసారి హెచ్చరిక జారీ చేసి, మళ్లీ తప్పు చేస్తే జరిమానా విధిస్తామని తెలిపింది. మార్చి 28న ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం కానుండగా, తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ, సన్‌రైజర్స్ జట్లు తలపడనున్నాయి.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## మిడ్ నైట్ బీచ్ గ్లామ్‌లో ప్రగ్యా జైస్వాల్ అందాలు

ముద్ర, సినిమా డెస్క్:
టాలీవుడ్ నటి ప్రగ్యా జైస్వాల్ మరోసారి తన గ్లామర్ ఫోటో షూట్‌తో సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించింది. 'కంచె' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం సినిమాల కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువగా యాక్టివ్‌గా కనిపిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన మిడ్నైట్ బీచ్ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో ప్రగ్యా పూర్తిగా వైట్ అవుట్‌ఫిట్‌లో స్టన్నింగ్‌గా కనిపిస్తోంది. ట్విస్టెడ్ ఫ్రంట్ డిజైన్ ఉన్న స్టైలిష్ క్రాప్ టాప్‌తో పాటు లాంగ్ ఫ్లోయింగ్ స్కర్ట్ ధరించి ఎలిగెంట్ లుక్‌లో మెరిసింది. ఒకే స్లీవ్ డిజైన్ డ్రెస్‌కు మరింత స్పెషల్ టచ్ ఇచ్చింది. సాఫ్ట్ మేకప్, లూజ్ వేవీ హెయిర్, స్పార్క్లింగ్ క్లచ్‌తో ఆమె లుక్ బీచ్ నైట్ బ్యాక్‌డ్రాప్‌లో మరింత హైలైట్ అయింది. బీచ్ బ్యాక్‌గ్రౌండ్, సాఫ్ట్ లైటింగ్, ప్రగ్యా ఇచ్చిన కాన్ఫిడెంట్ పోజులు ఈ ఫోటో షూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రేస్‌తో పాటు బోల్డ్ టచ్‌ను కూడా బ్యాలెన్స్ చేస్తూ ఆమె స్టైలిష్ లుక్‌ను ప్రెజెంట్ చేసింది. సినిమాల్లో కొంత గ్యాప్ వచ్చినా, గ్లామర్ ఫోటోషూట్లతో మాత్రం ప్రగ్యా జైస్వాల్ ఎప్పటికప్పుడు ట్రెండ్‌లోనే ఉంటోంది



## యూత్' రిలీజ్ డేట్ లో మార్పు


### 27న సినిమా విడుదల

ముద్ర, సినిమా డెస్క్:
కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'యూత్' విడుదల ఒక రోజు వాయిదా పడింది. ఈ సినిమా ఈ నెల 26న విడుదల కావాల్సి ఉండగా, అనివార్య కారణాలతో ఒక రోజు ఆలస్యంగా ఈ నెల 27న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. పెయిడ్ ప్రీమియర్స్‌పై త్వరలో ప్రకటన చేస్తామని తెలిపారు. తమిళంలో విజయం సాధించిన ఈ చిత్రాన్ని ఈ2సీ బ్యానర్‌పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్‌తో సినిమా ప్రమోషన్లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్, పాటలకు మంచి స్పందన లభించడంతో యూత్ ఆడియెన్స్‌లో ఈ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది.




## "యూత్" తెలుగులోనూ హిట్ అవుతుంది

**ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శ్రీ విష్ణు**
ముద్ర, సినిమా డెస్క్:
కెన్ కరునాస్ హీరోగా, అనిష్మ అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాన్షి యాదవ్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం "యూత్" ఇప్పుడు తెలుగులో కూడా విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాను ఈ2సీ బ్యానర్‌పై హౌస్‌ఫుల్ వినీత్, సందీప్ విడుదల చేస్తున్నారు. కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ ఈ నెల 26న థియేటర్లలోకి రానుంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరోలు శ్రీ విష్ణు, సత్యదేవ్‌తో పాటు దర్శకులు సాయి రాజేశ్, వశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ విష్ణు, తమిళంలో విజయాన్ని అందుకున్న "యూత్" తెలుగులో కూడా అదే స్థాయిలో సక్సెస్ సాధిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని అన్నారు. హీరోయిన్లు మీనాక్షి దినేష్, ప్రియాన్షి యాదవ్ మాట్లాడుతూ ఈ సినిమా యువత జీవితానికి దగ్గరగా ఉండే కథతో రూపొందిందని తెలిపారు. ప్రేమ, స్నేహం, స్ట్రగుల్స్, ఫన్ ఎలిమెంట్స్ అన్నీ ఈ మూవీలో ఉంటాయని, థియేటర్లలో చూసిన ప్రతి ప్రేక్షకుడికి రిలేట్ అయ్యే సన్నివేశాలు ఉంటాయని చెప్పారు. తమిళంలో వచ్చిన విజయాన్ని తెలుగులో ప్రేక్షకులు మరింత పెంచుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మాతలు సందీప్, వినీత్ మాట్లాడుతూ తమిళంలో మంచి స్పందన వచ్చిన ఈ సినిమాను తెలుగులో కూడా స్ట్రైట్ సినిమాలా రిలీజ్ చేస్తున్నామని చెప్పారు. ఫ్రెండ్స్ గ్యాంగ్‌తో కలిసి థియేటర్లలో చూసేలా ప్రత్యేకంగా ప్రమోషన్స్ చేస్తున్నామని తెలిపారు. ఈ సినిమా యూత్ మాత్రమే కాదు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను కూడా ఆకట్టుకుంటుందని అన్నారు. యూత్, ఫ్రెండ్షిప్, లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ కలిసిన ఈ మూవీ అన్ని వయసుల ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని చిత్ర యూనిట్ నమ్మకం వ్యక్తం చేసింది. ఈ నెల 26న విడుదల కానున్న "యూత్" సినిమాను ఫ్రెండ్స్, ఫ్యామిలీతో కలిసి థియేటర్లలో చూడాలని టీమ్ ప్రేక్షకులను కోరింది.



## సమ్మర్ ఫోటో షూట్‌లో సెగలు రేపిన వాణి కపూర్

ముద్ర, సినిమా డెస్క్:
బాలీవుడ్ నటి వాణి కపూర్ తాజాగా చేసిన సమ్మర్ ఫోటో షూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎండాకాలపు సూర్యకాంతిలో స్టైలిష్‌గా పోజులు ఇస్తూ ఆమె బోల్డ్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఫోటోలలో వాణి ఎంతో కాన్ఫిడెంట్‌గా, రిలాక్స్‌గా కనిపించడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ ఫోటో షూట్‌లో వాణి మోడ్రన్ సమ్మర్ అవుట్‌ఫిట్‌లో కనిపిస్తూ గ్లామర్‌ను హైలైట్ చేసింది. ఓపెన్ హెయిర్, మినిమల్ మేకప్, నేచురల్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆమె లుక్ మరింత స్టైలిష్‌గా కనిపించింది. బోల్డ్ లుక్‌తో పాటు ఎలిగెంట్ స్టైల్‌ను కూడా బ్యాలెన్స్ చేసిన విధానం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇటీవల సినిమాల పరంగా పెద్ద హిట్ కోసం ఎదురు చూస్తున్న వాణి కపూర్, తన ఫోటో షూట్లతో మాత్రం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూనే ఉంది. ప్రస్తుతం ఈ సమ్మర్ ఫోటోలు అభిమానుల్లో మంచి క్రేజ్ తెచ్చుకుంటూ వైరల్ అవుతున్నాయి.

## కొనసాగుతున్న రికార్డుల వేట

**'పుష్ప–2' రికార్డు బ్రేక్ చేసిన ధురంధర్**
ముద్ర, సినిమా డెస్క్:
రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం కేవలం 6 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి, త్వరలోనే రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరే దిశగా దూసుకుపోతోంది. ఈ చిత్రం రణ్‌వీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇండియా, విదేశాల్లో ఈ సినిమా మంచి వసూళ్లు సాధిస్తోంది. నార్త్ అమెరికాలో 16.5 మిలియన్ డాలర్లు రాబట్టగా, ఇండియాలో మంగళవారం నాటికి రూ.575 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేసింది. కేవలం 5 రోజుల్లోనే రూ.500 కోట్ల మార్క్ అందుకుని 'పుష్ప-2' రికార్డును అధిగమించినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.



## బ్లాక్ కట్‌అవుట్ డ్రెస్‌లో తాప్సీ పన్ను స్టన్నింగ్ లుక్

ముద్ర, సినిమా డెస్క్:
బాలీవుడ్ నటి తాప్సీ పన్ను తాజాగా లాక్మే ఫ్యాషన్ వీక్ 2026 ర్యాంప్‌పై షోస్టాపర్‌గా మెరిసి మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. డిజైనర్ మోనిషా జైసింగ్ కోసం ర్యాంప్ వాక్ చేసిన తాప్సీ, తన కాన్ఫిడెన్స్‌తో పాటు స్టైలిష్ అటిట్యూడ్‌తో షోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె వాక్ కేవలం ఫ్యాషన్ షోలా కాకుండా ఒక స్టేట్‌మెంట్‌లా అనిపించిందని ఫ్యాన్స్ చెబుతున్నారు. ఫోటోల్లో తాప్సీ బ్లాక్ కలర్ కట్‌అవుట్ డ్రెస్‌లో స్టన్నింగ్‌గా కనిపిస్తోంది. వన్ షోల్డర్ డిజైన్, నడుము వద్ద ఉన్న స్టైలిష్ కట్‌అవుట్ డ్రెస్‌కు బోల్డ్ టచ్ ఇచ్చింది. హై స్లిట్ డ్రెస్ లుక్‌ను మరింత ఎలిగెంట్‌గా మార్చగా, నేచురల్ కర్లీ హెయిర్ ఆమె స్టైల్‌ను ఇంకా హైలైట్ చేసింది. మినిమల్ యాక్సెసరీస్, కాన్ఫిడెంట్ బాడీ లాంగ్వేజ్‌తో తాప్సీ తన ప్రత్యేకమైన స్టైల్‌ను మరోసారి ప్రూవ్ చేసింది.
ర్యాంప్ వాక్ తర్వాత మాట్లాడిన తాప్సీ పన్ను తన సింపుల్ లైఫ్‌స్టైల్ గురించి సరదాగా చెప్పింది. ర్యాంప్‌పై క్వీన్‌లా కనిపించినా, ఇంట్లో మాత్రం ఓవర్‌సైజ్ టీషర్ట్స్‌లోనే కంఫర్ట్‌గా ఉంటానని చెప్పింది. ఫ్యాషన్ అనేది ఇతరులను ఇంప్రెస్ చేయడం కోసం కాదు, మనకు నమ్మకం కలిగించేలా ఉండాలని ఆమె అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇలా బోల్డ్ ఫ్యాషన్‌తో పాటు స్ట్రాంగ్ ఆలోచనలతో ఆమె మరోసారి అందరి ప్రశంసలు అందుకుంది






## 'చెన్నై లవ్ స్టోరీ' ఆడియో రైట్స్‌కు భారీ ధర!

ముద్ర సినిమా డెస్క్ :
మిడ్‌రేంజ్ చిత్రాల్లో ఆడియో రైట్స్‌కు భారీ ధర దక్కించుకుని సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది చెన్నై లవ్ స్టోరీ. హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ట్రేడ్ వర్గాల్లో మంచి క్రేజ్ ఏర్పడింది. ఈ చిత్రానికి మెలొడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తుండగా, ఆడియో హక్కులను టీ సిరీస్ సౌత్ భారీ ఫ్యాన్సీ రేట్‌కు సొంతం చేసుకోవడం విశేషం. మిడ్‌రేంజ్ సినిమాల్లో ఇంత పెద్ద డీల్ అరుదుగా జరగడం గమనార్హం. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు మంచి స్పందన రావడంతో పాటు, ఈ వారం ఫస్ట్ సింగిల్ విడుదలకు సిద్ధమవుతోంది. షూటింగ్ తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## భయపెడుతూ నవ్వించిన రాకాస

'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' సినిమాలతో ఎంటర్‌టైన్ చేసిన సంతోష్ శోభన్ హీరోగా నటించిన సినిమా 'రాకాస'. మెగా డాటర్ నిహారిక నిర్మించగా.. మానస శర్మ అనే అమ్మాయి దర్శకురాలిగా పరిచయమవుతోంది. హారర్ కామెడీ కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. ఏప్రిల్ 3న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇది ఆకట్టుకునేలా ఉంది. ట్రైలర్ బట్టి చూస్తే.. ఇదివరకు వచ్చిన హారర్ సినిమాల్లానే ఇందులో స్టోరీ ఉన్నట్లు అనిపిస్తుంది. ఏ మాత్రం సంబంధం లేని హీరో, ఓ పల్లెటూరికి వస్తాడు. అక్కడే ఉండే ఓ అమ్మాయితో ప్రేమలో పడతాడు. అనుకోని విధంగా హీరో సమస్యల్లో చిక్కుకుంటాడు. బ్రహ్మ రాక్షసుడికి ఆహారంగా ఊరంతా కలిసి ఇతడిని పాడుబడ్డ కోటలోకి పంపిస్తారు. అక్కడ హీరోకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయనేదే స్టోరీలా అనిపిస్తుంది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com